బుధవారం
25-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 124
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పాకిస్తాన్‌లో 'ఘౌరీ' పరీక్ష విజయవంతం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మంగళవారం ఘౌరీ ఆయుధ వ్యవస్థను విజయవంతంగా ప్రయోగించింది. ఈ మేరకు ఆ దేశ సైన్యం ఒక ప్రకటన చేసింది. అబాబీల్ ఆయుధ వ్యవస్థ- బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన వారం రోజుల్లోగా ఘౌరీ ఆయుధ వ్యవస్థ ట్రైనింగ్ ప్రయోగానికి పాక్ శ్రీకారం చుట్టింది.

ఆర్మీ వ్యూహాత్మక దళాల కమాండ్ (ఏఎస్ఎఫ్‌సీ) పనితీరు, సాంకేతికను పరీక్షించడమే ఈ ప్రయోగ లక్ష్యంగా అధికారిక ప్రకటన తెలిపింది. ఏఎస్ఎఫ్‌సీ కమాండర్, వ్యూహాత్మక దళాల అధికారులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల సమక్షంలో తాజా పరీక్ష జరిగింది.

బెంబేలెత్తిస్తున్న ఉల్లి

- మళ్లీ పెరిగిన ధరలు... కొరవడిన నియంత్రణ
- భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంట
- క్షేత్రస్థాయిలో ఉల్లి సాగుపై తగ్గిన ఆసక్తి

ముంబై: దేశ ప్రజలను నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఒకటి తర్వాత మరొకటి అన్నట్లుగా వంటింటి సరుకులు, కూరగాయలు, పండ్ల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఇది ప్రజలకు తీవ్ర భారంగా మారింది. పాలకులు మాత్రం ధరల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల వరకు టమాటా ధర తారస్థాయికి చేరి, కనీసం వంటల్లో వాడుకోలేని విధంగా చేసింది. టమాటా ధరలు కిలో రూ.250 వరకు పలికినా వాటి ధరలు మళ్లీ సాధారణ స్థితికి దిగి వచ్చాయి. ఇప్పుడు ఉల్లి ధర ఎగబాకడం మొదలుపెట్టింది. దాంతో వీటి ఎగుమతులను నియంత్రించడం ద్వారా దేశీయంగా ఉల్లి ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. నిత్యం వంటల్లో వినియోగించే ఉల్లిపాయల ధరలు ఇప్పుడు వేగంగా పెరుగుతున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి మార్కెట్‌గా ప్రసిద్ధిగాంచిన మహారాష్ట్రతో పాటు కర్నాటకలోనూ భారీ వర్షాల వల్ల ఉల్లి పంట దెబ్బతింది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో వాటికి కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కొన్నిచోట్ల కిలో నాణ్యమైన ఉల్లిపాయలు రూ.50 నుంచి 60 మధ్య పలుకుతున్నాయి. ఇప్పటికే దసరా పండుగ సమయంలో ధర భారీగా పెరగగా, దీపావళి పండగ సీజన్ కావడంతో ముమ్ముందు ఈ ధరలు మరింత పెరగవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రం ఉల్లి ఎగుమతులపై విధించే పన్నును ఆగస్టులో 40 శాతం మేర పెంచింది. ఇది ఈ ఏడాది చివరివరకు అమలులో ఉంటుంది. ఈ చర్యతో ఉల్లి ఎగుమతులు భారీగా తగ్గి, వాటి ధరలు నిలకడగా ఉంటాయన్నది ప్రభుత్వ యోచన. కానీ పరిస్థితి అందుకు భిన్నంగానే ఉంది. మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరుగుతున్నా దాన్ని గరిష్ఠ స్థాయిలో పండించే రాష్ట్రాల్లో గతంలో వర్షాభావం వల్ల దిగుబడి తగ్గింది. వర్షాకాలంలో కర్నాటకలో రైతులు ఉల్లిని అధికంగా పండిస్తుంటారు. కానీ నాలుగేళ్లుగా సకాలంలో వర్షాలు పడకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికితోడు ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించటంతో క్షేత్రస్థాయిలో రైతులు ఉల్లి సాగుపై పెద్దగా ఆసక్తి చూపటం లేదని వెల్లడయింది. పైగా వర్షాభావ పరిస్థితుల కారణంగా వేల హెక్టార్లలో వేసిన ఉల్లి సాగు నేలకొరిగిందని రైతులు

- మిగతా 2 లో

తీరని ఉపాధి కష్టాలు

- తక్కువ జీతాలు... కూలీ రాక ఆర్థిక వెతలు
- పురుషులు-మహిళల మధ్య పని, వేతనాల్లో వ్యత్యాసం
- ప్రభుత్వ లెక్కలకు భిన్నంగా వాస్తవ పరిస్థితులు

దేశ కార్మికుల స్థితిగతుల్లో మార్పు రావడం లేదు. చాలీచాలని జీతాలకే దొరికిన పనిని చేస్తూ కుటుంబాలను పోషించుకునే పరిస్థితుల్లో రోజువారీ కూలీలు, వేతన జీవులు ఉన్నారు. పురుషులకు, మహిళలకు లభించే పనిలో తేడాలతో పాటు వారికిచ్చే జీతాల్లోనే వ్యత్యాసం ఉంటోంది. సమాన పనికి సమాన వేతనం లభించడం లేదు. ఉపాధి పరిస్థితిలో మెరుగుదల ఉన్నట్లు కేంద్రం ఊదరగొడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేలా తాజా నివేదికలు వెలువడ్డాయి. కానీ వాస్తవ పరిస్థితులు భిన్న చిత్రాన్ని చూపుతున్నాయి.

న్యూఢిల్లీ: భారత్‌లో ఉపాధి పరిస్థితి మెరుగైనట్లు సూచించే కార్మికశక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్), కార్మిక జనాభా నిష్పత్తి (డబ్ల్యూపీఆర్) నివేదికలు తాజాగా వెలువడ్డాయి. నిరుద్యోగం తగ్గినట్లు ప్రభుత్వ నివేదికలు తెలిపాయి. త్వరలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో తాజా నివేదికలతో అధికార పక్షానికి లబ్ధి జరిగే అంచనాలు లేకపోలేదు. అయితే 4.2లక్షల మందికి ప్రాతినిధ్యం వహించే లక్ష కుటుంబాల ఆధారితంగా చేయబడే వార్షిక సర్వే పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) 2022-23 డేటాకు ప్రభుత్వ సర్వేల నివేదికలకు పొంతన లేదంటే ఆరోపణ కాదు. చాలా కాలంగా భారతీయ ఆర్థిక వ్యవస్థను ఉద్యోగ సంక్షోభం పీడిస్తోంది. 2019 నుంచి పరిస్థితి మరింత క్షీణించింది. కోవిడ్ మహమ్మారి విజృంభణ, లాక్‌డౌన్‌ల వల్ల ఆర్థిక మందగమనంతో ఉపాధి, ఉద్యోగావకాశాలు క్షీణించాయి. పనితగ్గ వేతనాలు లేకపోవడం, సరైన పని లభించకపోవడం, పని భద్రత లేకపోవడం వంటివి కార్మికలోకాన్ని కలచివేస్తూనే ఉన్నాయి. ఎటువంటి హామీలేకున్నాగానీ అసంఘటిత రంగ కార్మికులు పెరుగుతుండటం గమనార్హం. తక్కువ సంపాదన ఉన్నా స్వీయ ఉపాధికి మొగ్గు చూపే వారి సంఖ్యలోనూ పెరుగుదల నమోదైంది.

2020-22 మహమ్మారి కాలం కాగా అంతకుముందు అంటే 2018-19 పరిస్థితులపై పీఎల్ఎఫ్ఎస్ నివేదికతో సరిపోల్చితే పనిప్రపంచ ముఖచిత్రం ఎలా మారిందో అర్థమవుతుంది. 2018-19లో 50శాతంగా ఉన్న ఎల్ఎఫ్‌పీఆర్ 2022-23 నాటికి 58శాతానికి పెరిగింది. అలాగే డబ్ల్యూపీఆర్ 35శాతం నుంచి 41శాతానికి చేరుకుంది. ప్రస్తుత పీఎల్ఎఫ్ఎస్ నివేదిక ప్రకారం మహిళా ఎల్ఎఫ్‌పీఆర్ 25శాతం నుంచి 37శాతానికి, డబ్ల్యూపీఆర్ 18శాతం నుంచి 27శాతానికి పెరిగింది. 2018-19లో స్వీయ ఉపాధిపై 52శాతం మంది ఆధారపడగా, వేతనజీవులుగా 24శాతం మంది, కాజువల్ వర్కర్లుగా 24 శాతం మంది ఉన్నారు. అదే 2022-23లో స్వీయ ఉపాధి వారి శాతం 57శాతానికి పెరుగగా మిగతా రెండు విభాగాల వారి శాతాలలో తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా పురుషులు, మహిళాలకు మధ్య పని, వేతనాల వ్యత్యాసం ఆందోళకరంగా మారింది.

స్వీయ ఉపాధిపై ఆధారపడే మహిళలు 53శాతం (2018-19) నుంచి 65శాతానికి (2022-23కి) పెరిగితే రెగ్యులర్ మహిళా ఉద్యోగులు 22శాతం నుంచి 16శాతానికి తగ్గారు. కాజువల్ ఉద్యోగులు 25శాతం నుంచి 19శాతానికి తగ్గిపోయారు. యజమానులుగా ఉండే మహిళలు 23శాతం నుంచి 28శాతానికి పెరిగితే జీతాలు లేని పనివారి వాటా 31శాతం నుంచి 38శాతానికి చేరుకుంది. అదే పురుషులలో ఈ శాతాలు కాస్త భిన్నంగా ఉన్నాయి. స్వీయ ఉపాధి పొందే పురుషులు ఈ ఐదేళ్లలో 52శాతం నుంచి 54శాతానికి పెరుగగా, యజమానులు 44శాతం నుంచి 44.3శాతానికి, జీతాల్లేని సహాయకులు 7.6శాతం నుంచి 9.3శాతానికి పెరిగారు.

వ్యవసాయంపై ఆధారపడే కార్మికుల వాటా 41శాతం నుంచి 43శాతానికి, నిర్మాణరంగ పనులపై నమ్ముకునే వారి వాటా 12శాతం నుంచి 13శాతానికి పెరిగాయి. ఈ రెండు రంగాల్లో తక్కువ జీతాలు ఉండి, కొద్ది కాలమే పని దొరకడం, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయి. అడ్మినిస్ట్రేటివ్, వ్యక్తిగత సేవలకు, విద్య, ఆరోగానికి సంబంధించిన ఉద్యోగాలు ఉండే తయారీ రంగం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్ రంగాల్లో ఉద్యోగావకాశాలు పడిపోవడాన్ని బట్టి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అంచనావేయొచ్చు. అసంఘటిత రంగ

- మిగతా 2 లో

ఇక శ్రీలంకకు ఉచిత వీసా

భారత్ సహా 7 దేశాలకు అవకాశం

కొలంబో: ఆర్థికంగా చితికిన ద్వీపదేశం తమ పరిస్థితులను చక్కబెట్టుకునే పనిలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా దేశ పర్యాటక రంగానికి ఊతమిచ్చే చర్యలకు పూనుకుంది. భారత్‌తో సహా ఏడు దేశాలకు ఉచిత పర్యాటక వీసాలు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన పర్యాటక విధానానికి శ్రీలంక కేబినెట్ ఆమోదించినట్లు విదేశాంగ మంత్రి అలీ సాబ్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని ప్రయోగాత్మకంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. పైలెట్ ప్రాజెక్టు 2024 మార్చి 31 వరకు అమలవుతుందని పేర్కొన్నారు. పర్యాటకాన్ని

- మిగతా 2 లో

రాజకీయ వేడి

- అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రచార రథాలు సిద్ధం
- 'సామాజిక సాధికారత' పేరుతో వైసీపీ బస్సు యాత్ర
- 'నిజం గెలవాలి' పేరిట నారా భువనేశ్వరి పర్యటన
- మరోవైపు టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ ఉద్యమ కార్యాచరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో ఎన్నికలకు ఆరు నెలల ముందే రాజకీయం వేడెక్కుతోంది. ప్రతిపక్ష నేత చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసి నెలన్నర రోజులుగా జైలులో నిర్బంధించారంటూ ఇప్పటికే టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తుండగా, ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ప్రతిపక్ష వాదనలు తిప్పికొట్టేందుకు 'సామాజిక సాధికారిత' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రలను నిర్వహించేందుకు సన్నద్ధమైంది. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి ఏకకాలంలో ఈ బస్సు యాత్రలను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు వెళ్లేలా బస్సు యాత్రలకు రూట్ మ్యాప్ రూపొందించారు. వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ బస్సు యాత్రలను మంత్రులు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్, మున్సిపల్, నగర పాలక సంస్థలు, ఇతర సంస్థల్లో ఉన్నత పదవులు అనుభవిస్తున్న ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలకు చెందిన వైసీపీ నేతలు నిర్వహించనున్నారు. వీరంతా నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం పైన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు జగన్ ప్రభుత్వం చేసిన మేలుపై విస్తృతంగా ప్రచారం చేస్తారు. మరోపక్క టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని వివరిస్తారు. ప్రతి రోజూ మూడు ప్రాంతాల్లోనూ మూడు సభల చొప్పున కొనసాగుతాయి. స్థానిక ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల అధ్వర్యంలో

- మిగతా 2 లో

ఆర్థిక అవకతవకలపై కేంద్రం సమగ్ర విచారణ

రామకృష్ణ డిమాండ్

2లో

ఇదీ లోకం!

బీజేపీ ఒంటరేనా?

- టీడీపీ- జనసేన భేటీతో కమలానికి చిక్కులు
- ఏపీలో పాగా ప్రయత్నాలకు ఎదురుదెబ్బ
- బీజేపీ నుంచి టీడీపీకి వలసలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-జనసేన కలయికతో బీజేపీకి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒంటరిగా పోటీ చేసే సత్తా లేక సతమతమవుతోంది. బీజేపీతో పొత్తు అంటూనే జనసేన నేత పవన్ కల్యాణ్ టీడీపీతో జతకట్టారు. భవిష్యత్‌లో బీజేపీ తమతో కలిసి వస్తుందని పవన్ ఆశిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు, సీట్లు చీలనీయకుండా చేయడమే తన లక్ష్యమని అంటున్నారు. బీజేపీ నాయకత్వంతో చర్చించినా పొత్తుకు ముందుకు రావడం లేదని పవన్ చెబుతున్నారు. కేంద్రం వ్యూహాన్ని పసికట్టిన టీడీపీ మాత్రం జాతీయస్థాయిలో ఏ కూటమిలో చేరకుండా మౌనం వహిస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో టీడీపీ- జనసేన కలయికకు ఆస్కారం

- మిగతా 2 లో

పంచమ వర్ధంతి



కీ॥శే॥ కామ్రేడ్ **వంక సత్యనారాయణ** గారు
1924 - 2018
ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు, కమ్యునిస్టు ఉద్యమ నేత, పెనుగొండ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు
సమసమాజ నిర్మాణం కోసం అహర్నిశలు మీరు చేసిన కృషి, బడుగు బలహీన వర్గాలకు మీరు చేసిన సహకారం మరువ లేనిది
సదా మీ స్ఫూర్తితో...

వంక రవీంద్రనాథ్
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు

శ్రీమతి **వంక రాజ కుమారి**
తణుకు మున్సిపాలిటి మాజీ చైర్‌పర్సన్

శ్రీమతి వంక నాగమణి
శ్రీమతి బోడపాటి సీతామహాలక్ష్మి / శ్రీ మహేశ్వరరావు (హైదరాబాద్)
డా॥ శ్రీ వంక వెంకట రామదాస్ / డా॥ శ్రీమతి వసుంధర
శ్రీ వంక మోహనరావు / శ్రీమతి ఈశ్వరి
శ్రీమతి అడ్డాల అరుణరేఖ / శ్రీ వీరభద్రరావు (కాకినాడ)
శ్రీమతి పోతిరెడ్డి జ్యోతి / శ్రీ శిరీష్ (USA)
డా॥ శ్రీ వంక సిద్దార్థ / డా॥ శ్రీమతి పూర్ణిమ
శ్రీ వంక సతీష్ / స్వాతి
డా॥ శ్రీ అడ్డాల సత్యనారాయణ / శ్రీమతి రమ (కాకినాడ)
శ్రీమతి ఆకుల స్పందన / శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరరావు (USA)
శ్రీమతి తుపాకుల సాధన / శ్రీ ప్రవీణ్ (USA)
శ్రీమతి సింహాద్రి రవళి / శ్రీ వికాస్
డా॥ శ్రీ అడ్డాల రాధా కృష్ణ / శ్రీమతి సునీత (కాకినాడ)
శ్రీ వంక రఘువీర్ / శ్రీమతి శ్రావ్య
శ్రీ పర్వత రెడ్డి సుధాకర్ రెడ్డి / శ్రీమతి వసంత (కర్నూల్)
శ్రీ సింహాద్రి రమేష్ బాబు M.L.A / శ్రీమతి కెప్టెన్ లక్ష్మి (అవనిగడ్డ)

ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ ప్రై॥ లి॥ తణుకు
R.K హెయిర్ ప్రొడక్ట్స్ ప్రై॥ లి॥ తణుకు
రవళి స్పిన్నర్స్ ప్రై॥ లి॥ ఖండవల్లి
S.V.R స్పిన్నింగ్ మిల్స్ ప్రై॥ లి॥ మల్లేశ్వరం
కాకతీయ టెక్స్‌టైల్స్ లి॥ కోదాడ

పుతిన్‌కు గుండెపోటు!

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు గుండెపోటు వచ్చి పడక గదిలో మంచంపై నుంచి కిందకు పడిపోయినట్లు వార్తలొచ్చాయి. ఆయన పడక గది నుంచి శబ్దం రావడాన్ని గమనించి భద్రతా సిబ్బంది లోపలికి వెళ్లి చూడగా పుతిన్ కిందపడి ఉన్నారని, ఆహార పదార్థాలు, పానీయాలు చెల్లాచెదురుగా పడివున్నాయని నివేదికలు తెలిపాయి. ఆయనను భద్రతా సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా రహస్యంగా మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. పుతిన్ ఆరోగ్య పరిస్థితిపై క్రెమ్లిన్ వర్గాల నుంచి ఎటువంటి సమాచారం రాలేదు. అయితే ఈ ఘటన ఆదివారం రాత్రి 9.05 గంటలప్పుడు జరిగినట్లు రష్యా టెలిగ్రామ్ పోస్టు ఒకటి కలకలం రేపింది. పడక గది తలుపులు బద్దలకొట్టి భద్రతా సిబ్బంది లోపలికి వెళ్లినట్లు నివేదికలు తెలిపాయి. పుతిన్‌కు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. గతంలో కూడా పుతిన్ ఆరోగ్యానికి సంబంధించి అనేక కథనాలు వచ్చాయి. పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతూ ప్రత్యేక చికిత్స పొందుతున్నట్లు కథనాలు రావడం తెలిసిందే.

ఆరోగ్యంగానే ఉన్నారు: క్రెమ్లిన్

పుతిన్ ఆరోగ్యంగానే ఉన్నారని క్రెమిన్ ప్రకటించింది. ఆయన ఆరోగ్యంపై అన్నీ వదంతులు అంటూ కొట్టిపారేసింది. బాడీడబుల్ వాడుతున్న వాదనను తోసిపుచ్చింది. ఇది హాస్యాస్పందని వ్యాఖ్యానించింది. 'ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. ఇవన్నీ అబద్ధాలు' అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ అన్నారు.

లింగ సమానత్వం - సమాన వేతనం కోసం

ఐర్లాండ్‌లో మహిళల సమ్మె

'ఉమెన్స్ డే ఆఫ్'కు మద్దతిచ్చిన ప్రధాని కాట్రిన్

రెక్జావిక్: లింగ సమానత్వం, సమాన వేతనం, మహిళలపై నేరాలు, హింస కట్టడి కోసం ఐర్లాండ్‌లో మహిళలు దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. 1975, అక్టోబరు 24 నుంచి సమానత్వం కోసం ఐస్‌లాండ్ మహిళల పోరు సాగుతోంది. మంగళవారం 'ఉమెన్స్ డే ఆఫ్' పేరిట మహిళలు సమ్మెబాట పట్టారు. ఈ పోరుకు ప్రధాని కాట్రిన్ జాకోబ్స్‌డోట్టిర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. 'అక్టోబరు 24న ఐస్‌లాండ్ మహిళలంతా సమ్మె చేశారు. విధులను బహిష్కరించారు. ప్రదర్శనలు నిర్వహించారు' అని నిర్వాహకులు తెలిపారు. ప్రధాని కాట్రిన్ విలేకరులతో మాట్లాడుతూ 'మిగతా మహిళల్లాతో పాటు తానూ ఈరోజు పని చేయనన్నారు. ఐర్లాండ్ మహిళల పోరాటానికి సంపూర్ణ సంఘీభావం తెలిపారు. 'మేమింకా లింగ సమానత్వాన్ని పూర్తిస్థాయిలో సాధించుకోలేదు. లింగాధారిత వేతనాల వ్యత్యాసాన్ని పరిష్కరించలేదు. 2023లోనూ ఈ పరిస్థితి దురదృష్టకరం. మహిళలపై నేరాలు, హింసను అరికట్టాల్సి ఉంది. వీటన్నింటిపై ప్రభుత్వం దృష్టిపెట్టింది' అని ప్రధాని అన్నారు. దేశంలోని కిండర్‌గార్టెన్ టీచర్లలో 94శాతం మంది మహిళలే ఉన్నట్లు ఐస్‌లాండ్ టీచర్స్ యూనియన్ తెలిపింది. నేషనల్ యూనివర్సిటీ హాస్పిటల్ ఆఫ్ ఐస్‌లాండ్‌లో 80శాతం మంది కార్మికులు కూడా మహిళలే. కాగా ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వరుసగా 14 ఏళ్లుగా లింగ సమానత్వానికి అత్యుత్తమ దేశంగా ఐర్లాండ్‌ను ఎంపిక చేస్తూ వచ్చింది.

మెక్సికో దాడుల్లో 24 మంది మృతి

అకాపుల్కో: మక్సికోలో మూడు వేర్వేరు చోట్ల గుర్తుతెలియని వ్యక్తులు దాడులకు తెగబడగా 12 మంది పోలీసు అధికారులతో సహా 24 మంది మృత్యువాత పడ్డారు. అక్రమ మాదక ద్రవ్యాల రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హింస జరిగిందని, గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. కోయుకా డె బెనిటెజ్‌లోని గురెర్రో మున్సిపాలిటీలోని భద్రతా సిబ్బంది లక్ష్యంగా జరిగిన దాడిలో 13 మంది చనిపోగా ఇందులో 11 మంది మున్సిపల్ పోలీసు దళానికి చెందిన వారని ప్రాసిక్యూటర్ అలెగ్జాండ్రో హెర్నాండెజ్ తెలిపారు. పొరుగు రాష్ట్రమైన మిచోకన్‌లో జరిగిన మరో దాడిలో నలుగురు పౌరులు, ఒక పోలీసు చనిపోగా ఇద్దరికి గాయాలయ్యాయన్నారు. టకాంబరో పట్టణ మేయర్ సోదరుడు లక్ష్యంగా సాయుధ బృందం దాడి చేసిందని, ఆయన గాయాలతో తప్పించుకున్నారని చెప్పారు. సాయుధులు కాల్పులకు తెగబడిన తర్వాత వాహనాలు అక్కడ నుంచి పారిపోయిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరలైంది.

మూడవ ఘటన సెంట్రల్ మెక్సికోలోని ప్యూబ్లా రాష్ట్రంలో జరిగింది. డ్రగ్ డీలర్ల మధ్య కాల్పులలో ఆరుగురు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానిక యాంత్రాంగం తెలిపింది. మాదకద్రవ్యాలపై మెక్సికో 2006 నుంచి సైన్యం ద్వారా ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో రక్తపాతం జరుగుతూనే ఉంది. ఇప్పటివరకు వేర్వేరు ఘటనల్లో 4,20,000 మంది హత్యలకు గురయ్యారు.

బీజేపీ ఒంటరేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడింది. ఈనెల 23న రాజమహేంద్రవరం కేంద్రంగా టీడీపీ-జనసేన నేతల సమన్వయ కమిటీ తొలి సమావేశం జరిగింది. రెండు పార్టీలు కలిసి ముందుకెళ్లాలని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించాయి. ఈ నిర్ణయం బీజేపీకి షాక్ ఇచ్చినట్లు అయింది. ఇప్పటికే రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న చంద్రబాబుతో ములాఖత్ అయిన పవన్ కల్యాణ్, బాలకృష్ణ, లోకేశ్...తర్వాత టీడీపీ-జనసేన పొత్తును ప్రకటించారు. అదే సమయంలో తమతో కలిసి వచ్చే అంశాన్ని బీజేపీ నాయకత్వమే ఆలోచించుకోవాలని సుతిమెత్తని హెచ్చరిక చేశారు. దీనిపై బీజేపీ నాయకత్వం ఇంతవరకు స్పందించలేదు. టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ భేటీతో బీజేపీతో పొత్తులేనట్లేనన్న సంకేతాలు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా ఎదగాలన్న వ్యూహం గల బీజేపీ నాయకత్వానికి టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ భేటీ కోలుకోలేని ఎదురు దెబ్బగా మారింది. పవన్ కల్యాణ్‌ను అడ్డుపెట్టుకొని ఏపీలో బలపడాలన్న బీజేపీ కోరిక నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరికి బాధ్యతలు అప్పగించడం వెనుక టీడీపీని తొక్కాలన్న వ్యూహం బీజేపీ పెద్దల్లో స్పష్టంగా కనిపించింది. చంద్రబాబు అరెస్ట్ అనంతరం బీజేపీ వ్యూహాలు పూర్తిగా తారుమారయ్యాయి. చంద్రబాబు అరెస్టుపై తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ అనుచరులు, సానుభూతిపరులు బీజేపీ నాయకత్వంపై తీవ్ర వ్యతిరేకత చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అండదండలతోనే చంద్రబాబును అరెస్టు చేశారనే ప్రచారం విస్తృతంగా వచ్చింది. ఈ పరిణామాలతో గతంలో టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన సీనియర్ నేతలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు తిరిగి టీడీపీ గూటికి చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది.

జనసేన-టీడీపీ తొలి సమన్వయ కమిటీ భేటీని వైసీపీ జీర్ణించుకోలేకపోతోంది. వచ్చే ఎన్నికల్లో 175/ 175 సీట్లు సాధించాలన్న లక్ష్యంతో ఆ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. టీడీపీ-జనసేన దగ్గర కావడంతో కాపు సామాజిక ప్రాంత నియోజకవర్గాల్లో వైసీపీ దూకుడుకు అడ్డుకట్ట తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అదే సందర్భంలో టీడీపీ-జనసేన పొత్తు కారణంగా టీడీపీ కొన్ని సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో టీడీపీకి తిరుగుబాటు అభ్యర్థుల బెడద తప్పేలా లేదు. బీజేపీని పక్కకు నెట్టేసి జనసేన-టీడీపీ ఉమ్మడి కార్యాచరణతో ఎన్నికలకు సమాయత్తం కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. చంద్రబాబు అరెస్టు అనంతరం నిస్తేజంగా ఉన్న టీడీపీ శ్రేణులకు ఈ కలయిక కొత్త ఉత్సాహాన్ని నింపనుంది. టీడీపీ-జనసేన భేటీతో అధికార వైసీపీ దూకుడుకు సైతం కళ్లెం వేసినట్లయింది.

రాజకీయ వేడి

(మొదటిపేజీ తరువాయి)

బస్సు యాత్రలను నిర్వహిస్తారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మంత్రులు, నేతలు మాత్రమే ప్రసంగిస్తారు. వచ్చే ఎన్నికల్లో 175 నియోజకవర్గాలలో గెలుపే లక్ష్యంగా సామాజిక సాధికార బస్సుయాత్రలకు వైసీపీ శ్రీకారం చుట్టింది. ఒకవైపు ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తూనే, మరోవైపు పార్టీ పరమైన కార్యక్రమాలకూ సీఎం జగన్ కార్యాచరణ సిద్ధం చేశారు. ఉత్తరాంధ్రలో ఇచ్చాపురం, కోస్తాంధ్రలో తెనాలి, రాయలసీమలో సింగనమల నుంచి ఈ బస్సు యాత్రలు ఈనెల 26 నుంచి ప్రారంభమై డిసెంబరు వరకు యాత్రలు కొనసాగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులంతా ఈ బస్సు యాత్రలకు సిద్ధమయ్యారు. ఇందులో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు అందరు భాగస్వాములు కావాలని సీఎం ఆదేశించారు.

నిజం గెలవాలి పేరుతో భువనేశ్వరి బస్సు యాత్ర

టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆయన సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో రాష్ట్రవ్యాప్త బస్సు యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఈ బస్సు యాత్రకు బుధవారం ఆమె శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన బస్సుపై ఎన్టీఆర్, చంద్రబాబు, భువనేశ్వరి ఫొటోలతో కూడిన థీమ్‌ను తీర్చిదిద్దారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో ఆవేదన చెంది చనిపోయిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా ఆమె పరామర్శించనున్నారు. ఈ యాత్ర ద్వారా వారానికి మూడు రోజులపాటు ఆమె వివిధ నియోజకవర్గాల్లో బాధిత కుటుంబాలను కలుసుకుని, స్థానికంగా జరిగే సభలు, సమావేశాల్లో పాల్గొని ప్రభుత్వ అరాచక చర్యలను ఎండగడతారు. బస్సు యాత్రను పురస్కరించుకుని సోమవారం రాత్రి తిరుపతి చేరుకున్న భువనేశ్వరి మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు స్వగ్రామమైన నారావారిపల్లెలోని తమ కుల దైవం నాగాలమ్మకు, గంగమ్మ దేవతకు పూజలు నిర్వహించి అక్రమ అరెస్టుతో జైలులో ఉన్న ప్రజా నాయకుడు తొందరగా విడుదల కావాలని వేడుకున్నారు. అత్తమామలు నారా ఖర్జూర నాయుడు, నారా అమ్మణమ్మ సమాధి వద్ద నివాళులు అర్పించారు. తదుపరి నారావారిపల్లికి పెద్ద సంఖ్యలో చేరుకున్న నారా, నందమూరి కుటుంబీకులు, బంధువులు, చుట్టుపక్కల గ్రామస్తులు మహిళలతో కలిసి బస్సు యాత్రపై సమాలోచన చేశారు.

టీడీపీ-జనసేన వంద రోజుల ఉమ్మడి ఉద్యమ కార్యాచరణపై చర్చ

మరోవైపు టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ రాజమండ్రిలో అయిన తొలి భేటీ వంద రోజుల ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైంది. ఈ భేటీకి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, రెండు పార్టీలకు చెందిన కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ భేటీలో వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను, అలాగే, మొత్తం ఆరు అంశాలపై ఉమ్మడి మ్యానిఫెస్టో ఇవ్వాలా?, కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రకటించాలా అన్నదానిపైనా నేతలు చర్చించారు. ఈనెల 29, 30, 31 రోజుల్లో ఉమ్మడి జిల్లాల్లో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, నవంబరు 1 నుంచి మ్యానిఫెస్టో రూపొందించుకుని ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు.

సుస్థిర పాలన ఎలా అందించాలి, యువత, ఉద్యోగులు, రైతులకు ఎలాంటి పథకాలు ఉంటే బావుంటుందనే అంశాలపై రెండు పార్టీల నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రానికి వైసీపీ తెగులు పట్టుకుందని, దీనికి జనసేన-టీడీపీ కలయికే విరుగుడు అని, 2024లో ప్రభుత్వం ఏర్పడగానే రాజమండ్రిలోనే విజయోత్సవ సభ నిర్వహించాలని ఈ సమావేశం నిర్ణయించింది. ఇక సీపీఐ, సీపీఎం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఇలా మొత్తానికి రాజకీయపక్షాలన్నీ ప్రచార ఆందోళనా కార్యక్రమాలకు సిద్ధం కావడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

ఆర్థిక అవకతవకలపై కేంద్రం సమగ్ర విచారణ

విశాలాంధ్ర- విజయవాడ: రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా జరుగుతున్న లిక్కర్ స్కాం, ఆర్థిక అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి రాష్ట్ర ఆర్థిక అంశాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లుగా వార్తలు వస్తున్నాయని, గతంలో కూడా పురందరేశ్వరి ఢిల్లీ వెళ్లి అమీత్ షాతో రాష్ట్రానికి సంబంధించి ఎక్సైజ్, లిక్కర్ స్కామ్‌లపై విచారణ జరిపించాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. పురంధేశ్వరి కేంద్రాన్ని ఏమి కోరారో చెప్తున్నారే గాని, కేంద్రం తీసుకున్న చర్యలు గురించి గానీ, కేంద్రం నుంచి ఏం సమాధానం వచ్చిందనేదిగాని చెప్పటం లేదన్నారు. దీనిని బట్టి రాష్ట్ర బీజేపీ నేతలు, కేంద్రంలోని బీజేపీ నేతలు, రాష్ట్ర ప్రభుత్వం కలిసి పక్కాగా డ్రామా ఆడుతున్నట్లు అర్థమవుతుందని విమర్శించారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నామనే పద్ధతుల్లో పురంధేశ్వరి కేంద్రానికి ఫిర్యాదు చేస్తుంటే, కేంద్రం మాత్రం మౌనం వహిస్తోందని విమర్శించారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో లిక్కర్ స్కాం జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవటం లేదన్నారు. ఢిల్లీలో రూ. 100 కోట్ల లిక్కర్ స్కాం జరిగితే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియతో సహా కొందరిని జైలుకు పంపారని తెలిపారు. మరి ఏపీలో ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఏపీలో అప్పులు కేంద్రం అనుమతితోనే తొమ్మిది లక్షల కోట్లకు చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంతో కుమ్మక్కై ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్, అప్పులు, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

మణిపూర్ హింసలో విదేశీ శక్తుల హస్తం

- సాంస్కృతిక మార్క్సిస్టులు దేశాన్ని నాశనం చేస్తున్నారు
- ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్

నాగపూర్ : సాంస్కృతిక మార్క్సిస్టులు మేల్కొనే అంశాలను గందరగోళపరుస్తూ, అవినీతిని ప్రోత్సహిస్తున్నాయని, మీడియా, విద్యారంగం, ఇతర రంగాలలో వారి ప్రభావంతో వారు సామాజిక క్రమబద్ధత, నైతికత, సంస్కృతి, గౌరవం, సంయమనానికి భంగం కలిగించాలని చూస్తున్నారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మంగళవారం అన్నారు. నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ దసరా ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, మణిపూర్‌లో హింసాకాండ జరిగిందని, ఈ పరిస్థితికి 'బయటి శక్తులే' కారణమని ఆరోపించారు. 'మైతేయిలు, కుకీలు అక్కడ చాలా కాలంగా కలిసి జీవిస్తున్నారు. అక్కడ హింస జరగలేదు, జరిగేలా చేస్తున్నారన్నారు. ఇది సరిహద్దు రాష్ట్రం. ఇటువంటి వేర్పాటువాదం, అంతర్గత విభేదాల వల్ల ఎవరికి లాభం? బయటి శక్తులు కూడా లాభపడతాయి. అక్కడ జరిగిన దానిలో బయటి వ్యక్తుల ప్రమేయం ఉందా' అని భగవత్ ప్రశ్నించారు. 'కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో మూడు రోజులు ఉన్నారు. అసలు వివాదానికి ఆజ్యం పోసింది ఎవరు? ఇది (హింస) జరగడం లేదు, జరిగేలా చేస్తున్నారు' అని అన్నారు. 'మణిపూర్‌లో అశాంతి, అస్థిరతను ఉపయోగించుకోవడానికి ఏ విదేశీ శక్తులు ఆసక్తి చూపుతాయి? ఆగ్నేయాసియాలోని భౌగోళిక రాజకీయాలు కూడా ఈ సంఘటనలలో పాత్రను కలిగి ఉన్నాయా' అని ఆయన ప్రశ్నించారు. 'శాంతి పునరుద్ధరణ కనుచూపుమేరలో కొన్ని సంఘటనలు జరుగుతాయి. ఇది వర్గాల మధ్య అంతరాన్ని పెంచుతుంది. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వ్యక్తుల వెనుక ఎవరున్నారు? హింసను ఎవరు ప్రేరేపిస్తున్నారు?' అని అన్నారు. మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణకు కృషి చేసిన సంఘ్ కార్యకర్తలను చూసి తాను గర్విస్తున్నానని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నారు. జనవరి 22న అయోధ్య ఆలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని, దేశవ్యాప్తంగా ఆలయాల్లో కార్యక్రమాలు నిర్వహించి వేడుకలు నిర్వహించాలని ప్రజలను కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా ఓట్లను రాబట్టుకునే ప్రయత్నాల పట్ల భగవత్ హెచ్చరించాడు. దేశ ఐక్యత, సమగ్రత, గుర్తింపు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని కోరారు. హింసను ప్రేరేపించే, పరస్పర అపనమ్మకం, ద్వేషాన్ని సృష్టించే 'టూల్‌కిట్‌ల' వినియోగాన్ని ఆయన ప్రస్తావించాడు. ఐక్యతను కాంక్షించే వారు ఐక్యత గురించి ఆలోచించే ముందు అన్ని సమస్యలకు స్వస్తి చెప్పలేరని, చెదురుమదురు సంఘటనలకు తలొగ్గకుండా శాంతియుతంగా, సంయమనంతో పని చేయాలని తెలిపారు. 'మాతృభూమి పట్ల భక్తి, పూర్వీకుల పట్ల గర్వం, ఉమ్మడి సంస్కృతి అనే మూడు అంశాలు, భాష, ప్రాంతం, మతం, వర్గాలు, కులం, ఉపకులాల వైవిధ్యాలను కలుపుతూ మనల్ని ఒకే దేశంగా మార్చాయి' అని భగవత్ అన్నారు. భారతదేశం వెలుపల నుంచి ఉద్భవించిన విశ్వాసాలు ఈ అంశాలను సమర్థించాలి' అని అన్నారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ప్రభుత్వాన్ని ప్రశంసించిన భగవత్, 'ఆఫ్రికన్ యూనియన్‌ను సభ్యుడిగా ఆమోదించడంలో భారతదేశ నిజమైన సద్భావన, దౌత్య వ్యూహాన్ని అందరూ చూశారు' అని తెలిపారు. 'జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ వేదికపై భారత్‌ను ఒక ప్రధాన దేశంగా దృఢంగా స్థాపించడంలో మన నాయకత్వం ప్రశంసనీయమైన పని చేసింది' అని భగవత్ అన్నారు. 'భారతదేశ గుర్తింపు, హిందూ సమాజం గుర్తింపును కాపాడుకోవాలనే కోరిక సహజమైనది.

ఇందులో ఆశ్చర్యం లేదు. అప్పుడు సమకాలీన అవసరాలు, సమకాలీన సవాళ్లను ఎదుర్కొనేందుకు, భారత్ తన స్వంత విలువ వ్యవస్థల ఆధారంగా కొత్త దృక్పథంతో ఉద్భవించాలని సంక్షోభంతో నిండిన ప్రపంచం ఆశిస్తోంది' అని తెలిపారు. 'ప్రపంచం మతోన్మాదం, అహంకారం, మతోన్మాదం శాపంగా ఎదుర్కొంటోంది. మతపరమైన సెక్టానిజం నుంచి ఉద్భవించింది. ఉక్రెయిన్ లేదా గాజా స్ట్రిప్‌లో యుద్ధం వంటి వివాదాలకు ఏదైనా పరిష్కారం అస్పష్టంగానే ఉంది' అని తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న ఉల్లి

(మొదటిపేజీ తరువాయి)

వాపోతున్నారు. దేశీయంగా ప్రతి నెలా సగటున 13 లక్షల టన్నుల ఉల్లి వినియోగమవుతుంది. ఈ డిమాండ్‌ను ఎదుర్కోవడానికి ఏటా మూడు సీజన్లలో ఉల్లిని పండిస్తుంటారు. దేశంలో ఉల్లి ఎక్కువగా మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, కర్నాటక, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పండుతుంది. 65 శాతం పంట ఒక్క రబీలోనే వస్తుంది. అది ఏప్రిల్-మే మధ్య మార్కెట్లోకి వచ్చి అక్టోబరు-నవంబరు వరకు ఉంటుంది. అయితే, నిల్వ ప్రక్రియలోనే ఉల్లిపాయలు ఉత్పత్తి బరువులో 30-40 శాతం కోల్పోతాయి. కుళ్లిపోవడం వల్ల కొన్ని వృథా అవుతాయి. అలా పరిమాణంతో పాటు నాణ్యతపరంగానూ నష్టం వాటిల్లుతుంది. దేశంలో ఉల్లిపాయలను నిల్వ చేసేందుకు నాణ్యమైన ఏర్పాట్లు లేకపోవడంవల్ల ఏటా రూ.11 వేల కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని అంచనా. ఇదే సమయంలో దేశంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆహార ధరలు నియంత్రణలో ఉండాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఉల్లి ధర కేజీకి రూ.50కి మించకుండా ఉండాలని చూస్తుంది. ఈ సారి ఖరీఫ్ పంట ఆలస్యంగా చేతికి రావటంతో పాటు పంట దిగుబడి తగ్గడంతో ప్రస్తుత పరిస్థితులు ఏర్పడ్డాయి. పెరుగుతున్న ఉల్లిపాయల ధరలను అరికట్టడానికి కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగని ఇజ్రాయిల్ దురాక్రమణ

జెరూసలేం: గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ మరింత భీకరంగా సాగుతోంది. హమాస్ తీవ్రవాదులను తుడిచిపెట్టే వరకు దాడులను ఆపేది లేదని చెబుతోంది. పలస్తీనా భూభాగంపై బాంబుల వర్షం కురిపించేందుకు వెనుకాడబోమంటోంది. ఏకపక్షంగా 20వ రోజు దాడులను తీవ్రస్థాయిలో కొనసాగించింది. అర్ధరాత్రి జరిపిన దాడుల్లో 700 మంది చనిపోయారు. ఇప్పటివరకు పలస్తీనా ప్రజల్లో 5,791 మంది మరణించగా 16,297 మంది గాయపడ్డారని, మృతుల్లో సగం మంది చిన్నారులున్నారని గాజా ఆరోగ్యశాఖ మంగళవారం వెల్లడించింది. మరణించిన పిల్లల సంఖ్య 2,360కు చేరినట్లు తెలిపింది. వెస్ట్‌బ్యాంకు దురాక్రమణలో 96 మంది ప్రాణాలు కోల్పోగా, 1,650 మంది గాయపడినట్లు పేర్కొంది. తాజా దాడుల్లో రాఫా, ఖాన్ యూనిస్ ప్రాంతాల్లో 140 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజాలోని అల్ షాటి శరణాలయంపై ఇజ్రాయిల్ దాడి చేసినట్లు హమాస్ ప్రకటించింది. మానవతాకోణంలో ఇద్దరు మహిళలను హమాస్ సోమవారం విడుదల చేసింది. ఖతార్, ఈజిప్ట మధ్యవర్తిత్వంతో బందీల విడుదలకు హమాస్ అంగీకరించింది. మరో 50 మందిని త్వరలోనే విడుదల చేయనుంది.

చీకట్లోనే వైద్యం: ఉత్తర గాజాలోని ఆసుపత్రుల్లో అతిపెద్దదైన ఇండోనేసియా హాస్పిటల్‌లో ఇంధనం లేక జనరేట్లు పనిచేయక చిమ్మచీకటిలో వైద్యులు సేవలు అందించారు. గాజా ఆసుపత్రుల చుట్టూ భారీగా జరిగిన దాడుల్లో గాయపడిన వారితో ఆసుపత్రులు కిటకిటలాడాయి. ఇంధనం, విద్యుత్ సరఫరా లేక చీకటిలోనే అత్యవసర చికిత్స అందిస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. జనరేటర్లు పనిచేయని పరిస్థితిలో ఇంక్యూబేటర్లలోని శిశువుల ప్రాణాలు కాపడటం వైద్యులకు సవాల్‌గా మారింది. వైద్యసామాగ్రి లేక వైద్యులు తీవ్రస్థాయిలో ఇబ్బంది పడుతున్నారు. కాగా ఈజిప్ట నుంచి మూడోవ చిరుసహాయ కాన్వాయ్ గాజాలోకి ప్రవేశించింది.

బందీలందరినీ విడుదల చేస్తేనే కాల్పుల విరమణపై చర్చ: అమెరికా

బందీలందరినీ హమాస్ విడుదల చేస్తే గాజాపై కాల్పుల విరమణ గురించి చర్చిస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టంచేశారు. పలస్తీనా ప్రజలకు మానవతా సాయాన్ని ఎక్కువగా అందనివ్వాలని ఇజ్రాయిల్‌కు సూచిస్తున్న అగ్రరాజ్యం కాల్పుల విరమణపై స్వరం మార్చింది. కాల్పుల విరమణ హమాస్‌కు కలిసివచ్చే అంశంగా పేర్కొంది. మానవతా కోణంలో కాల్పులను విరమిస్తే ఇజ్రాయిల్‌పై దాడులు చేసేందుకు హమాస్‌కు సమయం లభిస్తుందని చెబుతోంది. 'కాల్పుల విరమణ హమాస్‌కు విశ్రాంతినిస్తుంది. ఇజ్రాయిల్‌పై దాడులు సాగించే సామర్థ్యాన్ని ఇస్తుంద'ని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అన్నారు.

ఎదురుదెబ్బ తప్పదు: ఇజ్రాయిల్‌కు ఒబామా హెచ్చరిక

గాజాపై ఏకపక్షంగా వైమానిక, భూతల దాడులు జరుపుతూ తీవ్రస్థాయిలో జరుగుతున్న ప్రాణ నష్టాన్ని విస్మరిస్తూ పోతే ఎదురు దెబ్బ తప్పబోదని ఇజ్రాయిల్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హెచ్చరిక చేశారు. కానీ ఇజ్రాయిల్ మాత్రం ఏ మాత్రం వెనక్కు తగ్గకుండా దాడుల తీవ్రతను పెంచుకుంటూ పోతోంది. హమాస్ నామ రూపాలు చేసే వరకు ఆగేది లేదని, తమను ఎవరూ అడ్డుకోలేరని ఉద్ఘాటిస్తోంది.

24 గంటల్లో 400 చోట్ల దాడులు

24 గంటల్లో ఏకంగా 400 ప్రాంతాల్లో దాడులు చేసి హమాస్

కమాండర్లు ముగ్గురిని, అనేకమంది తీవ్రవాదులను మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. హమాస్ అస్తిత్వం లేకుండా చేయాలన్నదే లక్ష్యమని ఇజ్రాయిల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ హరేజి హలేవీ తెలిపారు. దక్షిణ గాజాలో భూతల దురాక్రమణకు తమ సైన్యం పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు చెప్పారు. గాజాలోని 400కుపైగా సైనిక స్థావరాలపై దాడులు చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. లక్షిత ప్రాంతాల్లో కమాండ్ సెంటర్లు, మసీదులు, సముద్ర మార్గంలో ఇజ్రాయిల్‌లోకి చొరబడేందుకు హమాస్‌కు అవకాశమున్న సొరంగం ఉన్నట్లు వెల్లడించింది. హమాస్ విడుదల చేసిన ఇద్దరు మహిళలు రాఫా సరిహద్దు నుంచి చేరుకున్నట్టు క్షేమంగా చేరినట్లు తెలిపింది. హమాస్ చెరలో 222 మంది ఉన్నట్టు ధ్రువీకరించింది. కాగా, రాత్రి దాడుల్లో పదుల సంఖ్యలో పలస్తీనీయన్లు చనిపోయారని, 15 ఇళ్లు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. గాజాలో 24 గంటల్లో ఆరుగురు వర్కర్లను కోల్పోయినట్లు ఐరాస పలస్తీన్ శరణార్థుల సంస్థ ప్రకటించింది. ఇప్పటివరకు తమ సిబ్బందిలో 35 మంది చనిపోగా విధుల్లో ఉండగానే 16 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించింది.

మోకరిల్లి వేడుకుంటున్నాం: ఐరాస, డబ్ల్యూహెచ్ఓ

మానవతా సాయాన్ని నిరాటంకంగా గాజాకు చేర్చడం అత్యవసరమని ఐక్యరాజ్య సమితి (ఐరాస) పేర్కొంది. ముఖ్యంగా ఇంధనం సరఫరా చేయాలని కోరింది. వీధిపాలైన ప్రజలు సాయం కోసం ఎదురుచూస్తున్న వేళ పరిమిత సాయం పంపడం ద్వారా అపరిమితమైన అవసరాలు తీరబోవని పేర్కొంది. నిర్విరామంగా గాజాకు మానవతా సాయాన్ని, వైద్య సామాగ్రిని పంపాలని ఇజ్రాయిల్‌కు ఐరాస అధికార ప్రతినిధి తమారా అల్‌రిఫాయ్ కోరారు. ఇంధనం గాజా స్ట్రిప్‌కు చేరనివ్వాలని, అది ప్రస్తుతం ఎంతో అవసరమని అన్నారు. ఇంధనం లేక ఆసుపత్రుల్లో, బేకరీల్లో, నీటిప్లాంటు కోసం విద్యుత్ ఉత్పత్తికి జనరేటర్లు పనిచేయవన్నారు. దక్షిణ గాజాలోని మూడు ప్రధాన ఆసుపత్రులకు మందులు, వైద్య సామాగ్రిని చేర్చగలిగినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. ఉత్తర గాజాకు వైద్య సాయంగానీ ఇంధంగానీ చేర్చలేకపోతున్నామని ఆందోళన వ్యక్తంచేసింది. ఇదే విషయాన్ని డబ్ల్యూహెచ్ఓ అధికారి డాక్టర్ రిక్ బ్రెన్నన్ వెల్లడిస్తూ గాజా స్ట్రిప్‌లో మానవతా-వైద్య సంక్షోభం వేట మూడింట ఒకవంతు ఆసుపత్రులు పనిచేయడం లేదని తెలిపారు. 'మేము మోకరిల్లి వేడుకుంటున్నాం. మానవతా సహాయక చర్యల పరిమాణాన్ని పెంచండి. ఎట్టిపరిస్థితుల్లో సాయాన్ని ఆగనివ్వొద్దు. మానవతా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. అందుకోసం సంబంధిత వర్గాలపై ఒత్తిడి తేవాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నాం' అని బ్రెన్నర్ పేర్కొన్నారు.

ఇక శ్రీలంకకు ఉచిత వీసా

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భారత్, చైనా, రష్యా, మలేసియా, జపాన్, ఇండోనేసియా, థాయ్‌లాండ్ దేశాలకు ఇక నుంచి వీసా లేకుండా శ్రీలంకలో పర్యటించవచ్చని అధికారిక ప్రకటన తెలిపింది. మిగతా దేశాల పర్యాటకులు రుసుము లేకుండా శ్రీలంకకు వీసాలు పొందవచ్చని పేర్కొంది. భారత్‌తో శ్రీలంకకు సంప్రదాయ పర్యాటక బంధం ఉంది. సెప్టెంబరులో 30వేల మందికిపైగా భారత పర్యాటకులు ఆ దేశంలో పర్యటించగా, ఎనిమిది వేల మంది పర్యాటకులతో చైనా రెండవ స్థానంలో ఉంది. 2019లో ఈస్టర్ దాడుల్లో 270 మంది చనిపోగా ఇందులో11 మంది భారతీయులు ఉన్నారు. అప్పటి నుంచి ద్వీపదేశానికి పర్యాటకుల తాకిడి తగ్గింది. పర్యాటక రంగాన్ని పునరుద్ధరించుకోవాలని నిర్ణయించి తొలుత ఐదు దేశాలకు వీసా రహిత ప్రయాణానికి అనుమతివ్వాలని శ్రీలంక భావించింది కానీ ఏడు దేశాలకు అవకాశం కల్పించింది.

తీరని ఉపాధి కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగుల్లో పురుషుల వాటా 72శాతం నుంచి 78శాతానికి, మహిళల వాటా 54శాతం నుంచి 61శాతానికి పెరగడాన్ని బట్టి ఈ రంగ ఉద్యోగాలపై ఎంత మంది ఆశలు పెట్టుకుంటున్నారో అర్థంచేసుకోవచ్చు.

ఓ ఉద్యోగి/కార్మికుడు సగటున రోజుకు రూ.403 లెక్కన 30రోజులకు పని లభిస్తేగనుక నెలకు రూ.12,075 సంపాదిస్తాడు. పురుషులైతే రూ.12,990, మహిళలైతే రూ.8,385మేర నెలసరి వేతనం ఉంటుంది. స్వయం ఉపాధి విభాగంలో నెలకు సగటున రూ.13,131 సంపాదిస్తారు. పురుషులకు రూ.15,197, మహిళలకు రూ.5,516 మేర ఆర్జిస్తారు. వేతన జీవులైతే సగటున రూ.9,492 సంపాదిస్తారు. పురుషుల సంపాదన రూ.20,666గా ఉంటే మహిళలకు రూ.15,722గా ఉంటుంది. కొందరు ఇంకా తక్కువ సంపాదిస్తారు. ఇదిలావుంటే పీఎల్ఎఫ్ఎస్ 2022-23 డేటాను 2022 జులై నుంచి 2023 జూన్ వరకు సేకరించారు. దీని ఆధారంగా అరకొర వేతనాలు, గ్రామీణ, పట్టణాలు... పురుషులు, మహిళల మధ్య పని, వేతనాల వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టమవుతోంది. అంటే ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి ఆశాజనకంగా లేదని తెలుస్తోంది. పనిభద్రత లేకున్నా అసౌకర్యకర పరిస్థితుల్లో పనిచేయాల్సి వచ్చినాగానీ ఎంతో కొంత జీతం లభిస్తుందన్న ఆశతో పనిచేసే వారి సంఖ్య పెరుగుతున్నట్లు వెల్లడవుతోంది. చాలీచాలని వేతనాలతో కష్టమైన బతుకులకు అద్దం పడుతోంది. ఏ పని దొరికితే అది చేసేందుకు ఇష్టపడుతున్న కఠిన వాస్తవ పరిస్థితులను విధానరూపకర్తలు పరిగణనలోకి తీసుకోవడం, వీటిని పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తూ తక్షణమే చర్యలు తీసుకోవడం అత్యవసరం.

అవకాశాలన్నీ మన దేశంలోనే...

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- వేడుకగా విజ్ఞాన్స్ వర్సిటీ 11వ స్నాతకోత్సవం
- 51 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

విశాలాంధ్ర-గుంటూరు : ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కువ అవకాశాలు కలిగిన దేశం ఏదైనా ఉందంటే అది మన దేశమేనని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవాన్ని సోమవారం వర్సిటీ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ విదేశాల నుంచి 13 మేజర్ స్టార్టప్ కంపెనీలు మనదేశంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని తెలిపారు. ఆ కంపెనీలన్నీ ఉత్పత్తులను మన దేశంలో తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తాయన్నారు. విద్యార్థులు ఐటీ కంపెనీలలో ఉద్యోగాలు మాత్రమే కాకుండా కొత్త మెటీరియల్స్, రేర్ మినరల్స్, మెటీరియల్ సైన్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి రంగాలలో పరిశోధనలకు పూనుకోవాలన్నారు. దీనికి అనుగుణంగా ప్రస్తుత విద్యావిధానంలో ఎస్‌టీఈఎమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమాటిక్స్) కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సహజసిద్ధమైన గ్యాస్ టెక్నాలజీ మీద కూడా పరిశోధనలు చేయాలన్నారు. ఇప్పటికే ఇస్రో తన చంద్రయాన్-3 ద్వారా దక్షిణ ధ్రువం మీదకు వెళ్లగలిగామని, 2040 నాటికి మానవసహిత ప్రయోగానికి పూనుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విద్యార్థులందరూ మాస్టర్స్ డిగ్రీ కోసం విదేశాలకు వెళ్లినా నాలెడ్జ్‌ను బాగా పెంపొందించుకుని తిరిగి మనదేశానికే రావాలన్నారు. ప్రస్తుతం మనం పది రెట్లు అభివృద్ధి చెందితేనే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తామన్నారు. విజయదశమి రోజున డిగ్రీ పట్టాలు అందుకుంటున్న మీరందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం చంద్రయాన్-3 విజయాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలనే ఉద్దేశంతో చుట్టుపక్కల గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చంద్రయాన్ నమూనాను బహుమతిగా అందజేశారు. రాష్ట్ర ఆర్థిక, ప్లానింగ్, కమర్షియల్ టాక్స్ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులందరికీ అవకాశాలు అపారంగా ఉన్నాయని, వాటిని ఒడిసి పట్టుకోవాలని అన్నారు. విద్యార్థుల మేథోపరమైన, విద్యాపరమైన అన్వేషణను వారి వృత్తిపరమైన విజయాలను కుటుంబం, స్నేహితులు, శ్రేయోభిలాషులతో జరుపుకోవడానికి ఇది ఒక చిరస్మరణీయ వేదిక తెలిపారు. జీవితంలో మీరు ఏ పని చేసినా ఇష్టంతో, మనస్ఫూర్తిగా చేయాలని కోరారు.

ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు

స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, భారత చదరంగం క్రీడాకారిణి, పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత కోనేరు హంపికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది.

1820 మందికి డిగ్రీలు : వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్

విజ్ఞాన్స్ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం సందర్భంగా మొత్తం 1820 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. వీటితోపాటు 51 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ సుబ్బారావ్ పావులూరి మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, ఆట, పాట... ఎందులో టాపర్‌గా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే వీటిని ప్రణాళికతో అమలు చేస్తే భవిష్యత్‌లో కోరుకున్న విభాగంలో రాణించడం సులువవుతుందన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఒక్కటే విజయాన్ని అందించలేదని, ముఖ్యమైన జీవన నైపుణ్యాలను అలవర్చుకున్నవారే జీవితంలో రాణించగలరని తెలిపారు. విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పురోగతి నుంచి సామాజిక అసమానత వంటి అనేక గణనీయమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని అన్నారు. వీటిని కరుణ, సానుభూతి, ప్రపంచ పౌరసత్వ భావనతో పరిష్కరించడం రేపటి బాధ్యతాయుతమైన నాయకులుగా యువకుల బాధ్యత అన్నారు. వీటి కోసం వినూత్న పరిష్కారాలు వెతకాలని, స్థిరమైన భవిష్యత్‌కు కృషి చేయాలని కోరారు. కోనేరు హంపి మాట్లాడుతూ చదువు, ఆటలకు విద్యార్థులు సమ ప్రాధాన్యం ఇవ్వాలని, జీవితంలో ఆ రెండూ ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. కెరీర్‌లో రాణించడానికి ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో కృషి చేయాలని అన్నారు.

పట్టుదల, సంకల్పం మరువకూడదు : డాక్టర్ లావు రత్తయ్య

డిగ్రీ పట్టాలతో సమాజంలోకి అడుగుపెడుతున్న మీరు మీ లక్ష్యసాధనలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా పట్టుదల, సంకల్పం మరువకూడదని విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య విద్యార్థులకు ఉద్బోధించారు. ప్రస్తుత ఉద్యోగాలతో సంతృప్తి చెందవద్దని, రాబోయే కొద్ది సంవత్సరాల్లో మీ కోసం మరిన్ని అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని అన్నారు. మన దేశం ఆవిష్కరణలు, అభివృద్ధికి ప్రపంచ కేంద్రంగా మారడానికి సిద్ధమవుతోందన్నారు. విశ్వవిద్యాలయంలో నేర్చుకున్న జ్ఞానం, నైపుణ్యాలకు తగిన రంగాన్ని ఎంచుకుని అందులో రాణించాలన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఉజ్వల భవిష్యత్‌ను సృష్టించేందుకు, ప్రపంచాన్ని మార్చడానికి దోహదం చేస్తుందని అన్నారు. విజయం సాధించడం సులువు కాదని, సవాళ్లను ఎదుర్కోకపోతే ఏమీ నేర్చుకోలేరని తెలిపారు. కంప్యూటర్లు, హార్డ్‌వేర్ రంగంలో, సెమీకండక్టర్ టెక్నాలజీలలో అసాధారణమైన విజృంభణను చూస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సరిహద్దులను నెట్టివేసి, మనం ఊహించలేని భవిష్యత్తును సృష్టిస్తోందని తెలిపారు.

అంబరాన్నింటిన సంబరం

డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. నాలుగేళ్ల తమ అనుభవాలను విద్యార్థులు ఒకరికొకరు పంచుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. విశ్వవిద్యాలయంతో తాము పెంచుకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గుర్తుగా సెల్ఫీలు దిగారు. దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిన బూనారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్.రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్‌లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో వైసీపీ అక్రమాలు

విశాలాంధ్ర-విజయవాడ: వైసీపీ తిరిగి అధికారం నిలబెట్టుకోవాలని ఓటరు జాబితాలో అనేక అవకతవకలకు పాల్పడుతోందని టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాటాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితాలో అక్రమాలకు పాల్పడుతోందన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించేందుకు ఫామ్ 7ని పెద్దమొత్తంలో అప్‌లోడ్ చేస్తున్నరని చెప్పారు. ఐటీవలే పర్చూరులో 14 వేలకు పైగా ఫామ్ 7 దరఖాస్తు చేశారని, పుల్లిచెర్ల నుంచి ఇదే గ్రామంలో ఉన్న 189 మంది పేర్లు తొలగించడానికి ప్రయత్నించారన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి సంబంధం లేకపోయినా మార్టూరు, యుద్ధనపూడి, పర్చూరు మండలాలకు చెందిన ఎస్‌ఐలు, మార్టూరు సీఐ ఫామ్ 7 పెట్టడంలో ఒత్తిడి తెచ్చినట్లు సాక్ష్యాధారాలతో భారత ఎన్నికల సంఘానికి టీడీపీ తరపున ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, సీఈఓ, వీఆర్‌ఓలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టు నాటి నుంచి వైసీపీ వ్యతిరేక ఓట్లను తొలగించే పని అధికమైందన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణలు జరుగుతున్నాయని, ఇపుటి వరకు 7.60 లక్షల ఫామ్ 7 దరఖాస్తు చేయగా చంద్రబాబు అరెస్టు తర్వాత వారం రోజుల్లో 2,44,551 ఫామ్ 7లు అప్ లోడ్ చేశారని వివరించారు. వైసీపీ తమ అనుకూల ఓట్లను పెద్దఎత్తున చేరుస్తున్నదని ఆరోపించారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని అనుమానంతో ఓట్లు తొలగిస్తున్నారని చెప్పారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న వ్యక్తులకు ఒకేచోట నాలుగైదు ఓట్లు వచ్చేటట్లు ఫామ్ 6 పెట్టారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వివరించారు.

రేపు తూర్పు గోదావరి జిల్లాలో సీఎం పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 26న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. రాజా నగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు విజయ్ గణేష్ మోహన్ వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరవుతారు. ఉదయం 10.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి సీఎం బయలుదేరి రాజానగరం మండలం దివాన్‌చెరువు చేరుకుంటారు. అక్కడ డీబీవీ రాజు లేఅవుట్‌లో జరుగున్న విజయ్ గణేష్ మోహన్ వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. అనంతరం బయలుదేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

చంద్రబాబుపై టీడీపీ పగటి కలలు

ఎంపీ విజయసాయి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్ష నేతగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబు మళ్లీ 2024లో సీఎం అవుతారని కొందరు టీడీపీ నేతలు కలలుగంటున్నారని, రెండు, మూడు సార్లు ఎన్నికల్లో ఓడిపోయి మళ్లీ గెలవడం అందరికీ సాధ్యం కాదన్న విషయాన్ని గ్రహించాలని ఎంపీ, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో వాస్తవ రాజకీయ పరిస్థితులను చంద్రబాబు అభిమానులు గమనించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి వైసీపీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ప్రజారోగ్యం, విద్య, వ్యవసాయం సహా వివిధ రంగాల్లో తెచ్చిన మార్పులతో ప్రజలకు కలిగిన మేలును వివరిస్తూ ఈ బస్సు యాత్ర సాగనుందన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలకు జగన్ ప్రభుత్వం చేసిన మేలుపై ప్రచారం సాగనుందని పేర్కొన్నారు.

తెప్పోత్సవంలో రగడ !

- హంస వాహనంలోనే ఎక్కుతానని వెలంపల్లి పట్టు
- సాధ్యం కాదని చెప్పిన అధికారులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఇంద్రకీల్కాద్రి సాక్షిగా మంత్రి, మాజీ మంత్రి మధ్య మరో వివాదం చోటుచేసుకుంది. హంస వాహనంపై వీఐపీలు, నేతలకు అనుమతి లేదని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. హంస వాహనం వెనుక వీఐపీలకు మరో బోటు ఏర్పాటు చేశారు. అయితే, హంస వాహనం ఎక్కిస్తేనే వస్తానని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ పట్టుబట్టారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాల్లో ముగ్గేళ్ల తర్వాత కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, అత్యవసర సిబ్బంది తప్ప హంస వాహనంలోకి మరెవరినీ అనుమతించవద్దని మంత్రి కొట్టు ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. గతంలో హంస వాహనం సేవలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఈవో, కలెక్టర్, సీపీ సహా వీఐపీలను అనుమతించేవారు. ఇక్కడే అసలు వివాదం మొదలైంది. హంస వాహనం ఎక్కిస్తారని భావించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అందుకు అనుమతి లేదని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్‌లను వెనక్కి పంపారు. మంత్రిని తానే హంస వాహనం ఎక్కడం లేదని, వాహనం ఎక్కడానికి మనం ఏమైనా అర్చకులా, అయినా ఎవరి పాత్ర వాళ్లు పోషించాలని అన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కొట్టు, మాజీ మంత్రి వెలంపల్లి వీఐపీ బోటు ఎక్కలేదు.

వైసీపీ కార్యకర్త దారుణ హత్య

విశాలాంధ్ర-గురజాల: పల్నాడు జిల్లా గురజాల మండలంలోని జంగమహేశ్వరపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి వైసీపీ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యాడు. మద్యలు ధరించి సుమారు 8 మంది గుర్తు తెలియని వ్యక్తులు వెంటాడి నాటు కొడవళ్లతో, పదునైన కత్తులతో అతని గొంతు కోసి, శరీరంలో దాదాపు 22 చోట్ల పొడిచి హత్య చేశారు. విజయదశమి పండుగ జరుగుతున్న సమయంలో ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామం ఉలిక్కిపడింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కునిరెడ్డి కృష్ణారెడ్డి(30) మండలంలోని పులిపాడు గ్రామంలో మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. వైసీపీకి గ్రామంలో అతికొద్ది కాలంలోనే బలమైన కార్యకర్తగా ఎదిగాడు. కృష్ణారెడ్డి ఈ మధ్య కాలంలోనే ప్రేమ వివాహం చేసుకున్నాడు. మృతుడి భార్య గురజాల పట్టణంలోని గ్రంథాలయంలో లైబ్రరియన్‌గా పని చేస్తోంది. ఈ క్రమంలో అతికొద్ది కాలంలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక కార్యకర్తగా మారిన కృష్ణారెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేకనే టీడీపీకి చెందిన కొంతమంది హత్య చేశారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఒక హత్య కేసులో నిందితులుగా ఉన్న అదే గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నేతలు కొన్ని నెలల క్రితమే బెయిల్‌పై గ్రామానికి వచ్చారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో టీడీపీ ఉనికి కోల్పోతుందనే సమయంలో బలపడాలనే ఉద్దేశంతో ఈ హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. కృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం అర్ధరాత్రి సంఘటనా స్థలాన్ని డీఎస్పీ పల్లంరాజు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పికెట్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వక్కలగడ్డ పీఏసీఎస్‌కు జాతీయ గుర్తింపు

అమిత్ షా చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్న సురేంద్రనాథ్ బెనర్జీ

విశాలాంధ్ర-చల్లపల్లి: కృష్ణాజిల్లా చల్లపల్లి మండలంలోని వక్కలగడ్డ పీఏసీఎస్ ఇప్పుడు నేషనల్ కోఆపరేటివ్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌లో కీలకమైన వాటాదారు కావడం ఆక్కడి రైతాంగానికి గర్వకారణమని పీఏసీఎస్ అధ్యక్షులు హనుమాను సురేంద్రనాథ్ బెనర్జీ సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నేషనల్ కోఆపరేటివ్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ జాతీయ సింపోజియం సదస్సు ఘనంగా కేంద్ర హోం మంత్రి, సహకార మంత్రి అమిత్ షా అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని అమిత్ షా చేతుల మీదుగా సురేంద్రనాథ్ బెనర్జీ అందుకు న్నారు. ఈ సందర్భంగా బెనర్జీ మాట్లాడుతూ కేంద్ర మంత్రి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకునేందుకు దేవప్రసాదంగా ఎంపిక చేసిన ఐదు సంఘాలలో వక్కలగడ్డ పీఏసీఎస్‌కు స్థానం దక్కడం సంఘం పనితీరుకు నిదర్శనమన్నారు. సహకార మంత్రిత్వ శాఖ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కొత్త శకానికి నాంది పలికిందన్నారు. అందులో నేషనల్ కోఆపరేటివ్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ ఏర్పాటు ఒక కీలకమైన మిషన్‌గా నిలుస్తుందని తెలిపారు. ఎన్‌సీఈఎల్ ప్రాథమిక స్థాయి సహకార రంగ ఎగుమతుల కోసం ఒక నోడల్ సంస్థగా పని చేయడం, రైతులతో వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లకు చేరుకునేలా చేసే ప్రయత్నాలలో సహకార రంగాలను ఏకం చేయడమన్నారు. ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వక్కలగడ్డ సహకార సంఘానికి జాతీయస్థాయి గుర్తింపు రావడానికి సంఘ సభ్యుల, సిబ్బంది కృషి ఎంతగానో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కొల్లిపర సాంబశివరావు పాల్గొన్నారు.

ఏపీ ఆర్థిక స్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కి పురందేశ్వరి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల పైన, బెవరేజ్ కార్పొరేషన్ వంటి సంస్థల పైన కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తీవ్ర ఆర్థిక మోసాల విచారణ సంస్థ ద్వారా దర్యాప్తు చేయాలని పురందేశ్వరి కోరారు. ఈ ఏడాది జులై 26న ఆర్థిక అవకతవకలు, అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొత్తం అప్పులు రూ.10.77 లక్షల కోట్లు రాష్ట్ర ఆర్థిక నిర్వహణ తీరు, రాష్ట్రంలో జరుగుతున్న ఆర్థిక అవకతవకలు మీ దృష్టికి తీసుకువచ్చినా రాష్ట్ర ఆర్థిక నిర్వహణ తీరు ఇప్పటికీ అలాగే కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు మొత్తం రాష్ట్ర అప్పులపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేవలం ఆర్బీఐ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రూ.4.42 లక్షల కోట్ల అప్పులు మాత్రమేనని కేంద్రం తెలిపిందని, కార్పొరేషన్ల సహా ఇతర అవసరాలకు చేసిన అప్పులను ప్రస్తావించలేదన్నారు. పార్లమెంట్‌లో ఇచ్చిన ఈ సమాధానాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో తమ సొంత కుటుంబ మీడియా ద్వారా, వలంటీర్ల ద్వారా బీజేపీ రాష్ట్ర శాఖ ప్రతిష్ట దెబ్బతినే విధంగా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులను భవిష్యత్తులో కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే గత నాలుగు సంవత్సరాలుగా వివిధ రంగాల్లో చేసిన పనులకు గుత్తేదారులకు చెల్లింపులు చేయలేని దయనీయ స్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నెలకొందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన చెల్లింపులు సకాలంలో చేయకపోవడం వల్ల పెద్ద ఎత్తున బ్యాంకుల్లో బకాయిలు పేరుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చాలంటే రాబోయే 30 సంవత్సరాల కాలంలో ఏటా కనీసం రూ.36వేల కోట్లు అవసరమవుతుంది. అందువల్ల ఈ మితిమీరిన అప్పును కట్టలేని చేయాలంటే ముందుగా అన్ని రకాల గ్యారంటీలను, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆర్థిక అవకతవకలు, వివిధ కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు, ఆస్తులు తనఖా పెట్టి తెచ్చిన అప్పులు, ఇతర గ్యారంటీలను పరిగణనలోకి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు.



నిర్మాణ రంగానికి మరింత ప్రోత్సాహం

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో మంత్రి బుగ్గన హామీ

విశాలాంధ్ర-విజయవాడ: నిర్మాణ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనలో భవన నిర్మాణ రంగానిది కీలకపాత్ర అన్నారు. క్రెడాయ్ విజయవాడ 9వ ప్రాపర్టీ షో ముగింపు సందర్భంగా చివరి రోజైన సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాపర్టీ షోను ఆసక్తిగా తిలకించి, షోలో ఏర్పాటు చేసిన స్టాళ్లను నిశితంగా పరిశీలించారు. స్టాళ్లలో ఉంచిన మోడల్ సామగ్రి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి బుగ్గన మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మాణ రంగానికి ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్మాణ రంగం పుంజుకుందని, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద లక్షలాది ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కేవలం ఇళ్లు మాత్రమే కాకుండా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పనపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అందువల్ల నిర్మాణ రంగం ఊపందుకోవడంతోపాటు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరుగుతోందని చెప్పారు. నిర్మాణ రంగం గురించి మాట్లాడితే ముందు గుర్తొచ్చేది క్రెడాయ్ ప్రాపర్టీ షోలేనని మంత్రి బుగ్గన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి షోలు మరింత పెరుగుతుందన్నారు. క్రెడాయ్ ఎలాంటి సహకారం అందించేందుకైనా తాను, తమ ప్రభుత్వం సిద్ధమని స్పష్టం చేశారు. క్రెడాయ్ విజయవాడ అధ్యక్షుడు దాసరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి వరదా శ్రీధర్, కోశాధికారి సుధాకర్, సుభాష్ చంద్రబోస్, మామిళ్ళ వంశీ పర్యవేక్షణలో సమావేశం జరిగింది. క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణారావు, ప్రధాన కార్యదర్శి బాయన శ్రీనివాసరావు, ఎస్బీఐ డీజీఎం మహేష్ కుమార్, సహాయ కార్యదర్శి కె.రమేశ్ ఆనంద్, క్రెడాయ్ విజయవాడ పూర్వ అధ్యక్షుడు కె.రాజేంద్ర, ప్రముఖులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసమే పుట్టిన జనసేన

అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు కోసం, టీడీపీ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కాపాడేందుకు జనసేన పార్టీ పుట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. చంద్రబాబు-పవన్ మధ్య ఉన్న పాత కలయికకు రాజమహేంద్రవరంలో కొత్త రూపునిచ్చారని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకర్ల మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ టీడీపీతో ఎప్పుడు విడిపోయారని ప్రశ్నించారు. సున్నా సున్నా కలిసినా, హెచ్చించినా సున్నానేనని అన్నారు. ఇంకా ఈ తెలుగుగడ్డపై చంద్రబాబు అభిమానుల రూపంలో నరకాసురులున్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్‌కు అసలు వ్యవస్థలపై అవగాహన ఉందా? అని అన్నారు. బెయిల్ ఇవ్వాలా ? వద్దా ? అనేది న్యాయస్థానాలు నిర్ణయిస్తాయని, దానికి సీఎం జగన్‌పై నెపం వేయడాన్ని ఖండించారు. నాడు కాపు రిజర్వేషన్ల పోరాటంలో అరెస్టులు జరిగితే అవి అక్రమం కావా?, చంద్రబాబు అరెస్ట్ మాత్రమే అక్రమమా..? అని పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేశ్-అమిత్‌షా విషయంలో కిషన్‌రెడ్డి బండారం అంతా బయటపెట్టారని, ప్రగల్భాల పలకటం దేనికి ?, అబాసుపాలవ్వడం దేనికి..? అని ప్రశ్నించారు. పురందేశ్వరి తేడు టీడీపీ దొంగలా మాట్లాడటం లేదన్నారు. జైల్లో ఉన్న ప్రతి వాహా ప్రజల గుండెల్లో ఉండలేరని చెప్పారు.

27 నుంచి ఏఎంసీ వందేళ్ల ఉత్సవాలు

కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఈ నెల 27, 28, 29 తేదీలలో ఆంధ్ర మెడికల్ కాలేజీ సెంటినరీ(వందేళ్ల) ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవాల కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ 1923 జూలై 19న ప్రారంభమైందని, 2023 నాటికి వందేళ్లు పూర్తయ్యాయని చెప్పారు. ఏఎంసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంటినరీ ఉత్సవాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దేశంలోనే అతి పురాతన వైద్య కళాశాలల్లో ఒకటైన ఆంధ్ర మెడికల్ కాలేజీ వందేళ్ల ఉత్సవాలు మూడు రోజులు నిర్వహిస్తామని, ఉప రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని డా.రవిరాజ్ తెలిపారు. 1923లో 32 మంది వైద్య విద్యార్థులతో మొదలైన ఆంధ్ర వైద్య కళాశాల అంచెలంచెలుగా ఎదిగి 1950 నాటికే సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. దేశంలో అతి పురాతనమైన వైద్య కళాశాలల్లో ఏడవదని తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న వారు దేశ, విదేశాల్లో స్థిరపడి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వందేళ్ల ఉత్సవాలను కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రారంభిస్తారన్నారు. రెండవ రోజు ఉప రాష్ట్రపతితో పాటు గవర్నర్, రాష్ట్రమంత్రులు పాల్గొంటారని వెల్లడించారు. మూడవ రోజు తెలుగు సాహితీ వైభవం కార్యక్రమంతో పాటు రాత్రి సంగీత విభావరి ఉంటుందన్నారు.

ప్రారంభ కార్యక్రమం ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఉంటుందని, మిగిలిన కార్యక్రమాలు ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తామన్నారు. వందేళ్ల ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడేలా సెంటినరీ భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ పక్కన 1.6 ఎకరాల స్థలం కేటాయించిందన్నారు. ఈ భవనాన్ని ఉప రాష్ట్రపతి ప్రారంభిస్తారన్నారు. దేశ, విదేశాల నుంచి 3వేల మంది పూర్వ విద్యార్థులు ఉత్సవాలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్, ఏఎంసీ పూర్వవిద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు వైద్య కళాశాలలో పూర్తి ఫీజుల వసూళ్లు ఆపాలి

సీఎంకు ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోట కింద ప్రవేశాలు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల నుంచి పూర్తి ఫీజుల వసూలుపై విచారించాలని, రాష్ట్ర ప్రభుత్వ జీవో నంబరు 115 జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ నరహరి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు వైద్య కళాశాలలపై విచారించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ కు మంగళవారం ఆయన ఒక లేఖ రాశారు. ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. నీట్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా కింద ప్రైవేట్ కళాశాలల్లో సీట్లకు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల వద్ద నుంచి పూర్తి ఫీజు వసూలు చేస్తున్నారని, అలా చెల్లించని వారికి ప్రవేశాలు కల్పిస్తున్నారని తెలిపారు.

వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాలో డెంటల్ సీట్ పొందిన విద్యార్థి నుంచి యాజమాన్యం మొదటి ఏడాది రూ. 79 వేల హాస్టల్ ఫీజు కు వసూలు చేస్తున్నారని వివరించారు. వాటితోపాటు ఏటా రూ. 65 వేల చొప్పున ముందస్తుగా ఫీజు చెల్లించాలని నిబంధనలు విధిస్తున్నట్లు తల్లిదండ్రుల దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇదే పద్ధతిలో రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ వైద్య కళాశాల్లో కన్వీనర్ కోటా కింద ఎంపికైన ఎస్సీ, బీసీ, ఈబీసీ, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. ఇదే విధానాన్ని ప్రైవేట్ వైద్య కళాశాలల యాజమాన్యం వ్యవహరించడంతో తల్లిదండ్రులకు దిక్కుతోచని స్థితి ఏర్పడిందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, ఎన్ఎంసీ నిబంధనలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ లేఖ ప్రతులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, జాతీయ వైద్య మండలికి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా పరిరక్షణ కమిషన్‌కు ఆయన పంపారు.

సంపాదకీయం

అడ్డదారులు తొక్కుతున్న మోదీ

ఎన్నికలలో అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం కొత్తేమీ కాదు. కానీ ఇందులోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారులపై ప్రభుత్వ అభివృద్ధి కార్యకలాపాలను ప్రచారంచేసే బాధ్యత మోపారు. బీజేపీ తొమ్మిదేళ్లుగా అనుసరిస్తున్న మతతత్వ విధానాలను, విద్వేష ప్రచారాన్ని నమ్మరని మోదీ గ్రహించినట్టున్నారు. నవంబర్‌లో జరగనున్న అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, కొంత మేరకు చత్తీస్ గఢ్ మోదీ నాయకత్వానికి పరీక్ష పెట్టనున్నాయి. అందుకే కేంద్ర మంత్రులను, పార్లమెంటు సభ్యులను, బీజేపీ రాష్ట్ర కమిటీల అధ్యక్షులను, ఇతర సీనియర్ నాయకులను కూడా శాసనసభ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల జాబితాల్లో చేర్చారు. రాజస్థాన్‌లో రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వసుంధరా రాజే సింధియాను మొన్నటిదాకా నిర్లక్ష్యం చేశారు. ఆమె తిరుగుబాటు బావుటా ఎగరేస్తారన్న భయంతో ఆమెకు, ఆమె మద్దతుదార్లకు చివరకు టికెట్లు కేటాయించక తప్పలేదు. మధ్యప్రదేశ్‌లో 18 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కూడా పక్కన పెట్టినట్టే. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయ్యే దశకు చేరుకుంది. జనవరి 22న ఆలయం ప్రారంభిస్తారంటున్నారు. రామమందిర నిర్మాణం నినాదం ఇక బీజేపీకి ఓట్లు రాల్చే అవకాశంలేదు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలో ముఖ్యమంత్రి అభ్యర్థులెవరో బీజేపీ ప్రకటించడం లేదు. తమ పార్టీ గుర్తు అయిన కమలమే తమ ముఖ్యమంత్రి అభ్యర్థి అని అంటున్నారు. మోదీ హయాంలో రాష్ట్రాల స్థాయి నాయకులకు విలువలేకుండా పోయింది. ఎన్నికల ప్రచారంలోనూ వారికి అంత ప్రాధాన్యం లేదు. మొత్తం ఎన్నికల ప్రచార బాధ్యత మోదీయే మోస్తారు. తననుచూసి ఓటు వేయాలని కోరతారు. ఇన్ని ఎత్తులు ఎత్తినా ఓటమి భయం మోదీని వెంటాడుతూనే ఉంది. బీజేపీ విధానాలవల్ల ఓట్లురావని నిర్ణయించుకున్నందువల్లే మోదీ బీజేపీ అభివృద్ధి పథకాల ప్రచారానికి రెండు పథకాలు రూపొందించారు. ఒకటి: దేశవ్యాప్తంగా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడం. అన్ని సెల్ఫీ పాయింట్లలోనూ జనం నిలబడి ఫొటోలు తీసుకోవచ్చు. అన్నింట్లోనూ మోదీ ఫొటో ఉంటుంది. సెల్ఫీ పాయింట్ల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రచార బాధ్యత త్రివిధ దళాలవారికి అప్పగించారు. అంటే రక్షణ దళాలను నిస్సిగ్గుగా ఎన్నికల ప్రచారానికి వినియోగించుకుంటారు. రెండవది: సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారుల మీద కూడా ప్రభుత్వ పథకాల ప్రచార బాధ్యత పెట్టారు. ఉన్నతాధికారులు ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ ప్రభుత్వ పథకాల అమలుకు బాధ్యత వహించాలి. ఇది కొత్తేమీ కాదు. ప్రభుత్వ విధానాలు అమలు చేసేది ఆ అధికారులే. కానీ వాటిని ప్రచారం చేయాలని మోదీ ఆదేశిస్తున్నారు. ఈ ప్రచారానికి "వికసిత్ భారత్ యాత్ర" అన్నపేరు పెట్టారు. దేశవ్యాప్తంగా 765 జిల్లాల్లో నవంబర్ 20 నుంచి వచ్చే ఏడాది జనవరి 25 దాకా ఈ రథ యాత్రలు నిర్వహిస్తారట. ఐ.ఎ.ఎస్. ఉన్నతాధికారులు రథ సారథులట. సైనికులు ప్రచార బాధ్యత బుజానికెత్తుకోవాలన్న ఆదేశం ఈ నెల 9వ తేదీన విడుదలైంది. ఉన్నతాధికారులు రథ ప్రచారీల బాధ్యతలు నిర్వర్తించాలన్న ఆదేశం 18వ తేదీన జారీ అయింది. మాజీ ఐ.ఎ.ఎస్. అధికారులు ఈ అంశాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. కానీ ఐ.ఎ.ఎస్. అధికారుల సంఘం మాత్రం ఇప్పటి దాకా స్పందించిన దాఖలాలు లేవు. ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములం కాలేమని చెప్పే అవకాశం ఐ.ఎ.ఎస్. అధికారులకు ఉంది.

విచిత్రం ఏమిటంటే ఉన్నతాధికారులను తమకు అనుకూల ప్రచారానికి వినియోగించుకోవడానికి బీజేపీ రూపొందించిన పథకాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రికి లేఖ రాస్తే దానికి సమాధానం మోదీ నుంచి రాలేదు. బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా సమాధానమిచ్చి ఈ ఆదేశాన్ని సమర్థించారు. అయిదు రాష్ట్రాల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వు జారీచేసిన తరవాత ఐ.ఎ.ఎస్. అధికారులు రథ్ ప్రచారీలుగా బాధ్యతలు నిర్వర్తించాలని ఉత్తర్వు జారీ చేయడం ఈ అయిదు రాష్ట్రాలలో అమలులోఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బాహాటంగా ఉల్లంఘించడమే. మోదీ ప్రభుత్వం జంకు గొంకు లేకుండా నియమోల్లంఘనకు పాల్పడుతోందనడానికి ఇంతకన్నా రుజువు అక్కర్లేదు.

మోదీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు 1964నాటి సివిల్ సర్వీసు అధికారుల ప్రవర్తనా నియమావళిని ఉల్లంగించడమే. ఈ నియమావళి ప్రకారం ప్రభుత్వోద్యోగులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడానికి వీలు లేదు. ఈ అధికారులు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం అందించవచ్చు కానీ ఆ పనిని "వేడుక"గా నిర్వర్తించకూడదు. మోదీ చెప్పినట్టు మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత అమలు చేస్తున్నప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలనడం ఈ "వేడుక"లో ఉన్నతాధికారులను భాగస్వాములను చేయడమే. సమాచారం ఇచ్చే బాధ్యతను ప్రచారం స్థాయికి తీసుకురావడం ఏలెక్కన చూసినా అనైతికమే. ఐ.ఎ.ఎస్. అధికారులు అన్ని రాష్ట్రాలలో ఇలా వ్యవహరించడానికీ వీలు ఉండక పోవచ్చు. ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ప్రభుత్వాలు దీనికి అంగీకరించకపోవచ్చు. చరిత్ర తమతోనే ప్రారంభం అయిందని భావించే మోదీకి గతచరిత్ర కూడా గుర్తున్నట్టు లేదు. 1971 ఎన్నికలలో ఇందిరా గాంధీ యశ్పాల్ కపూర్ అనే అధికారిని తన ఎన్నికల ఏజెంటుగా నియమించారు. నిజానికి ఆయన తన పదవికి రాజీనామా చేశారు. అయితే ఆయన ఎన్నికల ఏజెంటుగా నియమితులయ్యే నాటికి ఆ రాజీనామా ఆమోదం పొందలేదు. దీనితోడు ఇందిరా గాంధీ ఎన్నికల ప్రచార కార్యక్రమ వేదిక ఏర్పాటు చేయడానికి అధికార యంత్రాంగాన్ని వినియోగించారనీ, ఆ వేదికకు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ స్తంభాల నుంచి విద్యుత్ వాడడం అక్రమం అని భావించి ఈ కారణలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని అలహాబాద్ హైకోర్టు ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పిన అంశాన్నీ మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు. సెల్ఫీ పాయింట్ల బాధ్యత సైన్యానికి అప్పగించడం, రథ్ ప్రచారీలుగా సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారులకు బాధ్యత అప్పగించడం కూడా అనైతికమే కాదు, అమలులో ఉన్న చోట ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే. గతంలో మోదీ నియమోల్లంఘనలపై ఎన్నికల సంఘానికి ఎన్ని ఫిర్యాదులు అందినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. ఎన్నికల కమిషన్ కమిషనర్లందరూ తాను నియమించిన వారేనన్న ధీమా మోదీకి ఉండవచ్చు. దేశమంతటినీ గుజరాత్ అనుకుంటున్నట్టున్నారు మోదీ. గుజరాత్ నుంచి రక్షణ దళాలాల్లో చేరే వారి సంఖ్య నామ మాత్రం. అక్కడ మోదీ ఆటలు చెల్లి ఉండొచ్చు. కానీ ఎన్నడూ రాజకీయాలలో జోక్యం చేసుకోకపోవడం మన సైన్యం విశిష్టత. సైనికులు, ఉన్నతాధికారులూ ఈ ఆదేశాలను అమలు చేయకుండా ఉంటారని ఆశిద్దాం. అనైతిక, చట్టవ్యతిరేక ఆదేశాలను పాటించకుండా ఉండే హక్కు సేనలకు, ఐ.ఎ.ఎస్. అధికారులకూ ఉంది.

రిటర్న్ గిఫ్ట్

రంగస్థలం

చింతపట్ల సుదర్శన్

ఒక్కో మెట్టు మీదా పడుతూ, లేస్తూ వస్తున్న డాగీని చూసింది డాంకీ. వీడికేమయిందివ్వాళ రెండేసి మెట్లకో గంతు చొప్పున అరుగెక్కేది అనుకున్న డాంకీ ముక్కుపుటాలకు ఏదో వాసన ఘాటుగా తగిలింది. అరుగుమీదకి వచ్చి గోడకి గుద్దుకుంటూ కూలబడింది డాగీ. ఏంటి బ్రో తేడాగా ఉన్నావు ఎనీ ప్రాబ్లమ్ అనడిగింది డాంకీ. 'నో ప్రోబ్లమ్ ఐయామ్ వెరీ హ్యాపీ' అనరిచింది డాగీ. హ్యాపీగా ఉన్నానన్న విషయం హ్యాపీగా చెప్పచ్చుగదా అరవడందేనికి అయినా నీ సౌండు అదో మాదిరిగా ఉందేం. సౌండా! షౌండా ! అదంతే చెక్‌పోస్ట్ దగ్గరకెళ్తే నువ్వూ నేనూ ఎవ్వరైనా అంటే బస్తీ మే సవ్వాల్ అంది డాగీ. ఏం జరిగిందక్కడ మాంచి జోరు మీదున్నావు ఏం జరిగిందా? మామూలుగా లేదు. కాకీ మామలున్నారు గదా. ఆళ్ళు వచ్చే కార్లు, పొయ్యే కార్లు ఆపి డిక్కీలు తెరిపించి వెతుకులాడుతున్నారు. ఓ కారు డిక్కీ నిండా బాటిళ్ళే బాటిళ్ళు. వాటిల్లో రంగురంగుల నీళ్ళు. అవి నువ్వు తాగావా అంది డాంకీ. పోలీసోళ్ళు ఆళ్ళకు చిక్కినవి మరొకళ్ళకిచ్చేస్తారా.. బాటిళ్ళు తీసి కింద పెట్టి లెక్కెడుతుంటే ఓటి రోడ్డు మీంచి జరజరా కిందికి పాకి ఓరాయికి తగిలి ఫట్టు మంది. దాంట్లోంచి ద్రవం అదే నీళ్ళు పల్లంలోకి వచ్చేయి మరి గోతి కాడ కుక్కలా కూచుని ఉన్న నీనోట్లో పడ్డాయి. అంతేగా అంది డాంకీ. అంటే అంటే అంతా అంతే కాదనుకో. కష్టపడి నాలుక మడతవిప్పి సాపుగా చాచి జుర్రుకున్నానంతే. చాలా ఘాటుగా వుంది వాసన సరేసరి. వద్దు వద్దనుకుంటూనే లాగించా. ఇంకేం మత్తు తలకెక్కి ఊగుతూ పడుతూలేస్తూ వచ్చావన్నమాట. మెట్లెక్కి అరుగుమీదికి రావడానికి ఆరుసార్లు అడ్డం పడ్డావు చూశా చూశా అంది డాంకీ. ఎలెక్షన్లయ్యే దాకా ఇలా కార్లను సోదా చేస్తూనే ఉంటారంటావా 'బ్రో'. వాళ్ళు చేస్తూనే ఉంటారు నువ్వు రోజూ ఆ గోతికాడ కూచుని చూస్తూనే ఉండు. చుక్క దొరికితే చప్పరిస్తూనే ఉండు. డ్రింకింగ్ అల్కహాల్ ఈజ్ డేంజర్ టు హెల్త్ తెలుసా. అది మనుషులకేమో అయినా అది ప్రాణాలు తీస్తుందని తెల్సినా వాడవాడలా దుకాణాలెందుకున్నాయి. విషం ప్రమాదకరం అని తెల్సినా దుకాణాల్లో పెట్టి అమ్ముతారెందుకు అంది డాగీ ముద్దముద్దగా మాటలు విసిరేస్తూ, విషం కాదోయ్ దాన్ని మందు అంటారు. మందు షాపులన్నమాట మందు అమ్మి, మనుషుల లివర్లు మింగితేగాని ప్రభుత్వాలు నడవలేని స్థితి వచ్చింది. వాహనాలు తాగే పెట్రోలుకూ మనుషులు తాగే మందుకూ డిమాండు పెరిగేదే కాని తరిగేది కాదు. పైగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం బ్రతికి బట్టకట్టాలంటే మందు కంపల్సరీ అంది డాంకీ. అదేమిటి బ్రో తాగింది నేనైతే నిషా నీకు ఎక్కలేదుకదా! ప్రజాస్వామ్యానికి, సీసాలో మందుకీ సంబంధం ఏమిటసలు? ఉంది నాయనా ఉంది. ప్రజా స్వామ్యమంటే ఎన్నికలు. ఎన్నికలేగదా. ఎన్నికలంటే ఓట్లు. ఓట్లు వేస్తేనే కద ప్రజాస్వామ్యం అంది డాంకీ . ఇప్పుడర్థమయింది . మందు వాసన కూడా పవరుఫుల్లేనని. అడ్డురాకు కొంచెం ఫ్లో ఉంటేగానీ విషయం క్లారిటీగా చెప్పలేను. ఓట్లు వేసేది ఎవరు ఓటర్లే కద. అవును ఓటర్లంటే మనుషులు. గాడిదలకూ, కుక్కలకూ ఓటుహక్కు ఎక్కడిది? కరెక్టు. గొర్రెల్లాంటి మనుషులకు మాత్రం ఓటు హక్కు ఉంది. వాళ్ళు ఆ హక్కును సజావుగా, నిజాయితీగా ఉపయోగించుకుంటే నిలబడేదే ప్రజాస్వామ్యం అవునా కాదా? కాదని నేనెందుకంటాను. ఓటర్లు ఓట్లు వేస్తేనే కద ఆఫ్ పీపుల్, ఫర్‌ద పీపుల్, బైద పీపుల్ అంది డాగీ. అబ్బో మందు బాగా పనిచేయిస్తుందే నీ బుర్రని, అయితే అదిప్పుడు లంచాల బారినపడి మంచ మెక్కేట్టుంది. లంచాలా? ఎవరు ఎవరికిస్తున్నారు? ఎన్నికల్లో గెలవాలనుకునే వాళ్ళు ఇచ్చే హామీలు లంచాలు కావా? ఇదిగో మేం మీకిచ్చే లంచాల జాబితా అని బాహాటంగా మానిఫెస్టోలు పంచుతున్నారుగదా. ఓటేస్తే యిదిగిదిగో యివే తాయిలాలు అంటూ మైకుల్లో ఊదరగొడ్తున్నారుగదా. ఓటర్లు తాము ఎవరికి ఓటెయ్యాలో వీటిని బట్టే నిర్ణయించుకోవాలిగదా! అని డాంకీ అంటుంటే అరుగుఎక్కాడు అబ్బాయి. అన్నారా అన్నా ! ప్రజాస్వామ్యానికీ, ఎన్నికలకీ, ఓట్లకీ, మందుకు సంబంధం ఏమిటన్నా. కులమూ, మతమూ, ప్రాంతమూ, చుట్టరికమూ కదా ఓటర్ల బుర్రలోని బూజు అంది డాగీ. అవన్నీ ఉన్నప్పటికీ తీరా ఎలెక్షన్ తేదీనాటికి మరుగునపడుతున్నవి. నోటూ, మందు సీసాలు మాత్రమే ఓటరు మనసు గెలుచుకుంటున్నవి. గెలిచాక గెలిచినవాడు వాడి సొంత జేబులు నింపుకోడం తప్ప ఊడబోడిచేదేమీ లేదని ఓటువేసే కూలిపనికి కూలి డబ్బుగా బీరూ, బిర్యానీ దక్కితే అదే దక్కుడని భావించే వాళ్ళు లేకపోలేదు అన్నాడు అబ్బాయి. ఈ సారి అదేం లేదన్నా చెకింగులు జరుగుతున్నవి. డబ్బు, మందు సీసాలూ స్వాధీనం చేసుకుంటున్నారు అంది డాగీ. పిచ్చి డాగీ శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలని దొరికేవి పాతికోవంతే. రహదారి ఒకటైతే అడ్డదారులు అరవై అంది డాంకీ. డ్రంకెన్ డ్రైవ్ లో ఊదుడు టెస్ట్ లాగానే ఓటు వెయ్యవచ్చే వాళ్ళకి ఊదే పరీక్ష పెడితే సరి ఓటువేస్తున్నది మందో, ఓటరో తెలిసిపోతుంది అంటూ అరుగు దిగాడు అబ్బాయి. దేవదాసు తాగి జగమే మాయ అన్నాడు. కాని పక్కన ఉన్న కుక్క తాగలేదు. తాగి చెడేవాడు మనిషి కాని మనం కాదు అంది డాంకీ. అర్థమైంది బ్రో చెక్‌పోస్టు వైపు ఇక పోనేపోను అంది డాగీ బరువెక్కిన తలను విదిలిస్తూ.

పోరాటాలలో రాటుదేలిన వంక

స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ తొలితరం నేత, మాజీ శాసనసభ్యులు వంక సత్యనారాయణ బాల్యదశనుంచే ప్రజాఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 5వ తరగతి చదువుతున్నప్పటినుంచే పెనుగొండ మిడిల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు యర్రమిల్లి కామేశ్వరరావు దేశభక్తియుత బోధనల ప్రభావం ఆయనను స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేలా చేసింది. స్వాతంత్ర్యానంతరం రష్యాలో లెనిన్ నాయకత్వాన ఏర్పడిన సోషలిస్టు సమాజనిర్మాణం జరగాలని దేశంలో కుల, మత భావనలు లేని ధనిక, పేద తారతమ్యాలులేని సమసమాజ నిర్మాణ సాధనే ధ్యేయంగా వంక తన జీవితాశయాన్ని నిర్దేశించుకున్నారు.

పెనుగొండలో ఎలిమెంటరీ విద్యను పూర్తిచేసుకుని 1939లో హైస్కూలు విద్యకు తణుకు చేరుకున్నారు. పరకాల పట్టాభి రామారావు సహకారంతో తన బాల్యమిత్రుడు భూపతిరాజు సుబ్బరాజుతో కలసి అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) నిర్మాణానికి పూనుకున్నారు. స్వాతంత్ర్య పోరాటానికి విద్యార్థులు వెన్నుదన్నుగా నిలిచారు. అనేక పోరాటాలు, సమ్మెలు విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రిటీష్ వ్యతిరేకమైన స్వతంత్ర భారతి పత్రిక వంక జీవితపథాన్ని పూర్తిగా మార్చివేసింది. రెగ్యులర్‌గా ఆపత్రిక చదవడంతో జాతీయోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమంపైన బలమైన పునాదులు వేసింది. 1942లో వంక కమ్యూనిస్టు పార్టీ ఆగ్జిలరీ మెంబరు అయ్యారు. తనమిత్రుడు భూపతిరాజు సుబ్బరాజుతో కలసి అన్సారీ, పరకాల పట్టాభి రామారావు, యాళ్ళబండి రంగనాయకులు లాంటి కమ్యూనిస్టు నాయకుల వద్ద కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూనే ఆనాటి కమ్యూనిస్టు నేతలు సంకు అప్పారావు, ఎం.వి.ఎస్ కపర్థీ, మారెళ్ళ నరశింహారావు, పరకాల శేషావతారం లాంటి వారితో కలసి జిల్లాలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. పోలీసుల నిర్బంధాలను, అరెస్టులను లెక్కచేయక మొక్కవోని దీక్షతో పనిచేసారు. కమ్యూనిస్టుపార్టీ నిషేధ సమయంలో సైతం ఉద్యమ నిర్మాణానికి ఎంతో ధైర్యసాహసాలతో అంకితభావంతో పనిచేశారు.

1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పోలీసుల దమనకాండను నిరసిస్తూ చేపట్టిన ఉద్యమంలో యండగండి వద్ద వంకతో పాటు పరకాల రమణరావు, భూపతిరాజు సుబ్బరాజు, పాకెర్ల సంజీవరావు, పేరిచర్ల చిన సోమరాజు, పరకాల శేషావతారం, నండూరి రామారావులను దేశరక్షణ చట్టం క్రింద అరెస్టుచేసి ఆరు నెలలు భీమవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం సబ్ జైళ్ళలో వుంచి విచారణ అనంతరం ఆలీపూర్ క్యాంపు జైలుకు ఆరునెలలు కఠిన కారాగార శిక్షవేసి పంపారు. క్విట్ ఇండియా 75వ వార్షికోత్సం సందర్భంగా 2018 ఆగస్టు 9న ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పురస్కారాన్ని వంక పొందారు. సీపీఐ నిషేధకాలంలో సైతం పోలీసు నిర్బంధాలను, అరెస్టులను లెక్కచేయక కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అంకితభావంతో పనిచేశారు.

పెనుగొండ నియోజకవర్గం నుంచి 1962,1972,1994 లలో మూడుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ వేదికగా వంక తన అనర్గళమైన వాగ్ధాటితో ప్రజాసమస్యలపై ఎంతో ఆవేశంతో వివరణాత్మకంగా ప్రసంగించేవారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేసేవారు. తన అనర్గళమైన వాద ప్రతివాదనలతో అధికార పక్షానికి ముచ్చెమటలుపట్టిస్తూ అసెంబ్లీ టైగర్‌గా పేరుపొందారు. పుచ్చలపల్లి సుందరయ్య, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, సివికే రావు, తరిమెల నాగిరెడ్డి, వేములపల్లి శ్రీకృష్ణ, తెన్నేటి విశ్వనాథం, ఈశ్వరీభాయి, వావిలాల గోపాలకృష్ణయ్య, చెన్నమనేని రాజేశ్వరరావు, విఠల్ రెడ్డి, ఎస్.శివరామకృష్ణ వంటి హేమాహేమీలతో వంక శాసనసభ్యునిగా పనిచేశారు. 1970 వ దశకంలో సోషలిస్టు నాయకుడు మధులిమాయే ఏవిధంగా పార్లమెంటులో తన గళాన్ని వినిపించేవారో సరిగ్గా అదేరీతిలో అసెంబ్లీ వేదికగా కమ్యూనిస్టుపార్టీ పక్షాన వంక తన ప్రజావాణిని వినిపించడంతో "మధులిమాయే ఆఫ్ ఏపీగా" అభివర్ణించేవారు. ఆరోజుల్లో ఆలిండియా రేడియో అసెంబ్లీ సమావేశాల సమీక్షకు పది నిమిషాలు కేటాయిస్తే అందులో ఏడెనిమిది నిమిషాల సమయాన్ని వంక లేవనెత్తిన అంశాల ప్రస్తావనే వుండేది. ఆనాటి ముఖ్యమంత్రులు కాసు బ్రహ్మానందరెడ్డి, జలగం వెంగళరావు లాంటి ఉద్దండులైన కాంగ్రెస్ నేతలు వంక మాట జవదాటే వారు కాదు. ఆయన సహచరులే కాకుండా ప్రత్యర్థులు సైతం వంకను అసెంబ్లీ టైగర్ గా పిలిచేవారు. శాసన సభ్యునిగా పెనుగొండ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. పేదలకు ఇళ్ళ స్థలాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, రోడ్లు, డ్రైన్స్‌తోపాటు పెనుగొండ నియోజకవర్గంలో పలుగ్రామాల్లో బ్యాంకు కెనాల్ పొడవునా (కాలువ) భారీ వంతెనలు నిర్మాణం, అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లాంటి ప్రాథమిక అవసరాలు వంక హయాంలోనే నెరవేర్చారు. పెనుగొండ, అత్తిలిలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయించడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉన్నతవిద్యను చేరువచేసిన ఘనత వంకదే. మార్టేరులో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు ప్రముఖ పాత్ర వహించారు. జిల్లాలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులను తేవడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి ఎనలేని కృషిచేసారు. వ్యవసాయ భూములకు సాగు నీరందించడంలో బ్యాంకు కెనాల్ నిర్మాణంతోపాటు అనేక పంట కాలువల నిర్మాణం వంక కృషి ఫలితమే.

అనేక సందర్భాల్లో రెండో పంట దాళ్వాకు నీరందించడంలో వంక పాత్ర విస్మరించరానిది. చెరకు, పుగాకు, వరి తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో వంక ఎనలేని కృషి చేశారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా మూడు పర్యాయాలు బాధ్యతలు చేపట్టిన వంక రాష్ట్ర వ్యాపిత భూపోరాటాలకు శ్రీకారం చుట్టారు. భూపోరాట యోధులు చంద్ర రాజేశ్వరరావు, గుజ్జుల యలమందారెడ్డి, నల్లమల గిరిప్రసాద్, దాసరి నాగభూషణరావు లాంటి ఉద్దండులతో కలసి భూపోరాటాలు సాగించి లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీచేయించడం ద్వారా భూపోరాట యోధుడిగా నిలిచారు. తణుకు తాలూకాలో తణుకు, వేల్పూరు, సూరంపూడి, పి.కాపవరం, ఈడూరు లాంటి అనేక గ్రామాల్లో అగ్రకులాలు దళితులను వెలివేతకు గురిచేసి సాంఘిక బహిష్కరణ విధించిన సందర్భంలో దళితుల పక్షాన కర్రపట్టిపోరాడి వారికి అండగా నిలచి వారిలో ధైర్యాన్ని, పోరాటపటిమను నింపిన ఘటనలు వంక జీవితంలో అనేకం. కార్మిక సంఘాల నిర్మాణంలో కనీసవేతనాల సాధనలో వంక ప్రముఖ పాత్ర నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణంలో సైతం వంక బాసటగా నిలిచారు. ఏలూరులో సీపీఐ కార్యాలయం స్ఫూర్తి భవన్ నిర్మాణంలో భూపతిరాజు మణ్యం, డివివియస్ వర్మలతో కలసి ప్రముఖ పాత్ర వహించారు. అలాగే తణుకులో సీపీఐ కార్యాలయం సురాజ్య భవన్ నిర్మాణంలో భూపతిరాజు సుబ్బరాజు, వాకలపూడి వీరరాఘవులు, వంక నాగమణి, కోనాల భీమారావు, గారప్రసాద్, ఇంటి వీరన్న తదితర పార్టీ నాయకులతో కలసి ప్రధానపాత్ర నిర్వహించారు.

1941 లో సీపీఐలో ఒక సామాన్య కార్యకర్తగా చేరిన వంక పార్టీ జాతీయసమితి సభ్యుని స్థాయికి ఎదిగారు. తుదిశ్వాస విడిచేవరకు పార్టీని వీడలేదు. పార్టీ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడిగా, జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నో ఉన్నత బాధ్యతలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా పార్టీకి రాష్ట్ర కేంద్రం నుంచి సుదీర్ఘకాలం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించి ఆ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి తనవంతు కృషిచేశారు. వంక సత్యనారాయణ విశాలాంధ్ర విజ్ఞానసమితి అధ్యక్షుడుగా పనిచేసిన సమయంలో ఆర్థిక ఇబ్బందులు, కోర్టు కేసులతో తీవ్ర సంక్షోభంతో పేపరు నడుపలేని పరిస్థితి ఏర్పడిన సందర్భంలో విశాలాంధ్ర మూతపడనీయకుండా అప్పటి వేంద్ర డెల్టా పేపరు మిల్లు ఎం.డి.భూపతిరాజు విజయకుమార్ రాజుతో మాట్లాడి న్యూస్‌ప్రింట్ బకాయిలు వసూలు నిమిత్తం ఇచ్చిన కోర్టు నోటీసులు ఉపసంహరింపజేసి బకాయిలు పక్కన పెట్టించి ఒక నెలకు సరిపడా న్యూస్‌ప్రింట్ పంపించేట్లుగా మాట్లాడి పత్రిక యధావిధిగా నడవడానికి కృషి చేశారు.

(నేడు వంక సత్యనారాయణ 5 వ వర్ధంతి సందర్భంగా)

కోనాల భీమారావు
ఫోన్: 9705557367

బీజేపీ రెండు నాలుకల ధోరణి !



ఎం కోటేశ్వరరావు

ప్రపంచంలో అత్యంత ప్రతిభావంతమైన గూఢచారి సంస్థలలో ఒకటైన మొసాద్ తమ ప్రభుత్వానికి హమాస్ దాడుల గురించి ఎందుకు ఉప్పందించలేకపోయిందన్న ప్రశ్నకు దాడి జరిగిన రెండు వారాలకు కూడా ఇజ్రాయిల్ ప్రభుత్వం చెప్పలేకపోతోంది. మొసాద్ మన 'రా'అమెరికా సీఐఏ లాంటి గూడచారి సంస్థ ఇప్పుడు మేం యుద్ధంలో ఉన్నాం వాటి గురించి దర్యాప్తు జరపటం లేదని అధికారులు సమాధానమిస్తున్నారు. స్వజనం, ఇతర దేశాల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక తప్పుదారి పట్టించేందుకు అసలు హమాస్‌కు ఆయుధాలు ఎక్కడినుంచి వచ్చాయన్న అంశంపై అనేక కథనాలను ప్రచారం చేస్తున్నారు. హమాస్ సంస్థ అధికారంలో ఉన్న గాజా ప్రాంత విస్తీర్ణం 360 చదరపు కిలోమీటర్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా ఎంతో తెలుసా ? 7,257చదరపు కిలోమీటర్లు. జన సాంద్రత 1,474. కిమీ. గాజా గడచిన పదిహేడు సంవత్సరాలుగా చుట్టూ ఆరు మీటర్ల ఎత్తున ఇనుపకంచెతో అనుమతి లేకుండా జనం బయటకు పోకుండా చేసిన ఒక బహిరంగ జైలు మాదిరి ఉంది. జనాభా ఇరవై మూడు లక్షలు. చదరపు కిలోమీటరుకు 6,507. అలాంటి జనసమ్మర్దం ఉన్న పలస్తీనాలో తీవ్రవాదులను పట్టుకోవాలన్న పేరుతో ఇజ్రాయిల్ విమానాలతో బాంబులు వేస్తోంది. సగం ప్రాంతాన్ని ఖాళీచేసి వేరేవైపు వెళ్లమని జనాన్ని నెట్టేస్తోంది. తరువాత మరో సగాన్ని మరోవైపు పంపి నాశనం చేయాలన్నది దాని పథకం. ఇటు వంటి దుర్మార్గాన్ని గట్టిగా కొనసాగించమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత అల్లుడు, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ సలహా ఇచ్చి వెళ్లారు. మన ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా వెళ్లలేదు తప్ప ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించటం బైడెన్, సునాక్ అడుగుల్లో అడుగు వేయటమే !

నిజమే హమాస్‌కు ఆయుధాలు ఎక్కడినుంచి వచ్చాయనే పశ్నకు సమాధానం కోరుతున్న వారు 1947కు ముందు వివిధ దేశాల నుంచి బ్రిటీష్ ఆక్రమణలో ఉన్న పలస్తీనా ప్రాంతంలోకి యూదులు ఎలా వచ్చారు, వారికి ఆయుధాలు ఎలా అందుబాటులోకి వచ్చాయి, మిలిటరీ శిక్షణ ఎవరు ఇచ్చారు అన్న వాస్తవాలు తెలుసుకుంటే పలస్తీనాకు చెందిన హమాస్‌కు అస్త్రాలు ఎక్కడి నుంచి వచ్చిందీ తెలుసుకోవటం అంత కష్టం కాదు. పలస్తీనా ప్రాంతాన్ని ఆక్రమించి ఇజ్రాయిల్‌ను ఏర్పాటు చేయాలన్న ముందస్తు పథకంతో ఉన్న బ్రిటన్, ఇతర సామ్రాజ్యవాదులు ఎక్కడెక్కడినుంచో యూదులను రప్పించి ఆయుధాలు, శిక్షణ ఇచ్చారు. ఐరాస తీర్మానంచేసిన నాటినుంచి వారు పలస్తీనా ప్రాంతాలను ఆక్రమించుకోవటం ప్రారంభించారు. మాతృభూమి రక్షణకోసం పోరాడుతున్న వారికి నాటినుంచి నేటివరకు మద్దతుఇస్తున్న ఇరుగుపొరుగు దేశాలు ఆయుధాలు అందిస్తున్నాయి. ఇది అందరికీ తెలిసిన రహస్యం !

పాకిస్తాన్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యంకోసం బంగ్లాదేశ్ పౌరులు ఉద్యమించారు. ఆయుధాలు చేతబట్టి గెరిల్లా పోరు సాగించారు. వారికి ఆయుధాలు ఎవరు ఇచ్చారు ? తుపాకి పట్టిన ప్రతివారినీ ఉగ్రవాది అనలేం. బంగ్లా ముక్తివాహిని పేరుతో తిరుగుబాటుచేసిన వారికి మన దేశం మద్దతు ప్రకటించటమే కాదు, మన మిలిటరీనికూడా పంపి పాక్ సైన్యాన్ని అణచివేసింది. బంగ్లా విముక్తికి ఆయుధాలు పట్టిన వారిని నాడు జనసంఘం సమర్ధించింది. నేడు పలస్తీనా వాసులు ఆయుధాలు పట్టినందుకు బీజేపీ తప్పుపడుతోంది. నిజానికి బంగ్లా విభజనకు ఐరాస తీర్మానాలు లేవు. పలస్తీనా ఏర్పాటుకు తీర్మానం ఉన్నప్పటికీ అడ్డుకుంటున్న ఇజ్రాయిల్‌కు నరేంద్రమోదీ, బీజేపీ మద్దతు ప్రకటించటం రెండు నాలుకల వైఖరికి నిదర్శనం. బంగ్లా విముక్తికి చర్యలు తీసుకున్నందుకు అభినందిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ అధినేత గురుజీగా పిలుచుకున్న గోల్వాల్కర్ కూడా ఇందిరా గాంధీకి లేఖ రాశారు. మద్దతు పలికినందుకుగాను అతల్ బిహారీ వాజ్‌పేయికి 2015లో బంగ్లాదేశ్ అత్యున్నత "విముక్తి యుద్ధ గౌరవ" అవార్డును ప్రకటించింది. తమ దేశ ఏర్పాటుకు అడ్డుపడుతున్న ఇజ్రాయిల్‌మీద పలస్తీనియన్లు అనేక రకాలుగా పోరాడుతున్నారు. ఇజ్రాయిల్ దుర్మార్గాలను గుర్తించేందుకు నిరాకరించటం తప్ప మరొకటి కాదు. ఉక్రెయిన్ అంశంలో తటస్థవైఖరి తీసుకున్న మోదీ ఇప్పుడు ఒక పక్షం వహించటం అంటే అమెరికా కూటమి మెప్పు పొందేందుకు తహతహలాడటమే. రష్యా నుంచి ఆయుధాల అవసరం ఉంది, చౌకగా చమురు దొరుకుతుంది గనుక తటస్థం అన్నారు. పలస్తీనా నుంచి అలాంటివేమీ ఉండవు గనుక ఒక పక్షానికి మద్దతు పలుకుతున్నారు.

హమాస్ ఆయుధాలను ఇరాన్ నుంచి తెచ్చుకుంటున్నదని, గాజాలోనే తయారు చేస్తున్నారంటూ సిఐఏ చెప్పిందని మీడియాలో వార్తలు వచ్చాయి. హమాస్‌కోసం ఇరాన్ ఆయుధాలను అక్రమంగా సేకరిస్తున్నదని, దానితో పాటు స్వంతంగా తయారు చేసుకోవటం గురించి శిక్షణ ఇస్తున్నట్లు సిఐఏ ఆరోపించింది. వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్ అనే అమెరికా అనుకూల సంస్థ నిపుణుడు మైకేల్ నైట్స్ తమ దేశం ఇజ్రాయిల్‌కు పంపిన ఆయుధాలను పట్టుకొని లేదా బ్లాక్‌మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నదని చెప్పాడు. స్మగ్లింగ్ జరిగే మార్గాలను ఈజిప్టు కట్టుదిట్టం చేసిన తరువాత గాజాలోనే తయారు చేసుకుంటున్నారని అన్నాడు. తప్పేముంది. ఇజ్రాయిల్ వైపు నుంచి మిలిటరీ, సాయుధ యూదులు బాంబులు వేస్తుంటే పలస్తీనియన్లు రసగుల్లాలు విసురుతారా? ఇదే సంస్థ 2021లో విడుదల చేసిన ఒక నివేదికలో ఇజ్రాయిల్ ప్రయోగించిన వాటిలో కొన్ని పేలలేదని, పేలిన వాటి విడిభాగాలను రీసైక్లింగ్‌చేసి హమస్ నిపుణులు స్వంతంగా ఆయుధాలను రూపొందిస్తున్నారని పేర్కొన్నది. హమాస్ సాయుధుల దాడుల చిత్రాలను చూసిన అమెరికా పార్లమెంటు సభ్యులు కొందరు మాట్లాడుతూ ఉక్రెయిన్‌కు పంపినవి లేదా అఫ్గానిస్తాన్‌లో వదలి వచ్చినవి గానీ వారి చేతుల్లోకి వచ్చినట్లు చెబుతున్నారు. ఉక్రెయిన్‌కు పంపిన ఆయుధాలను అది బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుంటున్నదని కూడా చెబుతున్నారని అందువలన ఉక్రెయిన్‌కు సాయం అందించకూడదని కూడా మైకేల్ నైట్స్ చెప్పాడు. కాదు కాదు ఇలాంటి వార్తలన్నింటినీ రష్యా పుట్టిస్తున్నది కనుక నమ్మవద్దని మరికొందరు తమ ప్రభుత్వాన్ని సమర్ధిస్తున్నారు.

భార్యాభర్తల సవాల్

- తగ్గేది లేదంటున్న రీటా చౌదరి
- గెలుపు నాదేనంటున్న వీరేంద్రసింగ్
- రాజస్తాన్ దంత రామ్‌గఢ్ ఎన్నిక ఆసక్తికరం

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రత్యేకించి దంతరామ్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయపోరు ఆసక్తికరంగా మారింది. ఈ నియోజకవర్గంలో భార్యాభర్తలు ప్రత్యర్థులుగా పోటీ చేస్తున్నారు. రీటా చౌదరిని హరియాణా కేంద్రంగా పనిచేస్తున్న జేజేపీ తమ అభ్యర్థిగా రంగంలోకి దించుతుండగా ఆమె భర్త, సిట్టింగ్ ఎమ్మెల్యే వీరేంద్ర సింగ్ తిరిగి పోటీ చేస్తున్నారు. వీరేంద్రసింగ్‌కే కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో భార్యాభర్తల మధ్య ఎన్నికల పోరు ఆసక్తిగల రాజకీయ పోరాటంగా మారింది. అల్వార్ రామ్‌గఢ్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే షఫియా జుబేర్‌కు పాలక కాంగ్రెస్ టికెట్ నిరాకరించింది. ఆ స్థానంలో జుబేర్ భర్త, మాజీ ఎమ్మెల్యే జుబేర్ ఖాన్‌కు టికెట్ కేటాయించింది. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 25న జరుగుతాయి. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న ఉంటుంది వీరేంద్రసింగ్ తండ్రి నారాయణ్ సింగ్ పీసీసీ అధ్యక్షుడిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇది పూర్తిగా కాంగ్రెస్ కుటుంబం. సంప్రదాయం ప్రకారం కుటుంబం కాంగ్రెస్‌కు అండగా నిలిచింది. అయితే వీరేంద్ర భార్య రీటా ఆగస్టులోనే జననాయక్ జనతా పార్టీ(జేజేపీ)లో చేరారు. పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. 2018 ఎన్నికలకు ముందు దంత రామ్‌గఢ్ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని రీటా చేసిన విజ్ఞప్తిని కాంగ్రెస్ పార్టీ నిరాకరించింది. అప్పుడు పార్టీ టికెట్ ఆమె భర్తకు దక్కింది. నాటి నుంచి నియోజకవర్గంలో రాజకీయంగా పట్టు సాధించడానికి రీటా పనిచేశారు. చాలామంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైతం రీటాతో పాటు జేజేపీలో చేరారు. జేజేపీ సోమవారం రీటా చౌదరితో పాటు ఆరుగురి పేర్లతో జాబితాను ప్రకటించింది. 'మనస్సు చెప్పినట్లే నేను వింటాను. ఏది మంచి అని నేను భావిస్తే అదే చేస్తాను. అందుకే నేను జేజేపీలో చేరాను. నియోజకవర్గ ప్రజలు నాతోనే ఉన్నారు. నాకు వారు...వారికి నేను ఉన్నాం. నాకు అవసరమైనప్పుడల్లా అండగా నిలిచారు. ప్రజలు నన్ను అంగీకరిస్తారు. నా నిర్ణయాన్ని స్వాగతిస్తారు' అని రీటా చౌదరి పీటీఐకి చెప్పారు. 'ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. అందుకే సంతోషంగా ఉన్నారు. దంత రామ్‌గఢ్ నియోజకవర్గం అభ్యర్థిగా పార్టీ నన్ను ఎంపిక చేసింది. నేను విజయం సాధిస్తానన్న నమ్మకం నాకు ఉంది' అని ఆమె స్పష్టంచేశారు. మీ భర్తతోనే రాజకీయ పోటీకి దిగుతున్నారా అని అడుగగా 'కాంగ్రెస్ ఇప్పటికీ నా భర్తకు టికెట్ కేటాయించలేదు. అందువల్ల దీనిపై నేను మాట్లాడలేను. కానీ ప్రజలు మాత్రం మార్పు కోరుకుంటున్నారు' అని ఆమె చెప్పారు. అభివృద్ధి, నీటి సమస్య, నిరుద్యోగం వంటి కీలక అంశాలపై తాను శ్రద్ధ వహిస్తానని స్పష్టంచేశారు. నియోజకవర్గ ప్రస్తుత ప్రతినిధి కొంతమేరకు పనులు చేశారని, ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని చెప్పారు. కాగా, ఈ ఎన్నికల్లో తమ మధ్య ముఖాముఖి పోరు ఉంటుందని రీటా భర్త చెప్పారు. జేజేపీ తన భార్యకు సీటు ఇచ్చిందని, తనకు తిరిగి టికెట్ ఇస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. మూడు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, కొత్త పాఠశాలల నిర్మాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశానని, అభివృద్ధి ప్రధాన అజెండాగానే ఎన్నికలు జరుగుతాయని స్పష్టంచేశారు. 2018లో వీరేంద్రసింగ్ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసి విజయం సాధించారు. ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని నారాయణ్‌సింగ్ స్పష్టంచేయడంతో ఆ సీటు తనయుడు వీరేంద్రసింగ్‌కే కాంగ్రెస్ ఇచ్చింది. నారాయణ్‌సింగ్ 1972, 1980, 1985, 1993, 1998, 2003లో ఎమ్మెల్యేగా గెలిచారు. దంత రామ్‌గఢ్ నియోజకవర్గంలో జాట్ల ఆధిపత్యం అధికం. రైతుల సంఖ్య ఎక్కువే. మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెకావత్ 1951లో మొదటిసారి ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.

బీజేపీకి ఇండియా కూటమే ప్రత్యామ్నాయం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి బీజేపీపై ధ్వజమెత్తారు. దేశ పురోగతికి కేంద్రంలోని బీజేపీ ఒక్క పని కూడా చేయలేదని ఆరోపించిన ఆయన.. ఇప్పుడు ఆ పార్టీకి ఇండియా కూటమి ప్రత్యామ్నాయంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం దేశం మూడు సమస్యల్ని ఎదుర్కొంటోందని, అందుకు కేంద్రం వద్ద ఎలాంటి సమాధానం లేదని చురకలంటించారు. దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీని తరిమికొట్టాల్సిందేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

పార్టీ కార్యకర్తలనుద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడుతూ, "ఇంతకుముందు ఎలాంటి ఆప్షన్ లేదని చెప్పేవారు. కానీ.. ఇప్పుడు బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఇండియా కూటమిని ప్రజలందరూ ఆప్షన్‌గా చూస్తున్నారు. ఇండియా కూటమి గట్టిగా నిలబడితే, 2024 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడదని నాకు చాలా మెసేజ్‌లు వచ్చాయి. ప్రస్తుతం మన దేశం ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతి అనే మూడు సమస్యలను ఎదుర్కొంటోంది. అయితే.. వీటికి కేంద్ర ప్రభుత్వం వద్ద ఎలాంటి సమాధానం లేదు. దేశం అభివృద్ధి చెందాలన్నా, కుటుంబ శ్రేయస్సు కావాలన్నా.. ఈసారి బీజేపీని తరిమికొట్టాలని ప్రతి ఇంటికి వెళ్లి స్నేహితులు, బంధువులకు ఈసారి బీజేపీని తరిమికొట్టాలని చెప్పండి" అని అన్నారు. అంధ భక్తులైన బీజేపీ కార్యకర్తలతో ఏమాత్రం వాదనవద్దని కేజ్రీవాల్ ప్రజలను సూచించారు. అంధ భక్తులతో మమేకం కావొద్దని, కేవలం దేశ భక్తులతోనే మాట్లాడండని, దేశభక్తులు ఎవరైనా మీ మాట వింటారని అన్నారు. అంధ భక్తుడికి దేశంతో సంబంధం లేదని, అతడు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే ప్రేమిస్తాడంటూ చురకలంటించారు.

పట్టాలు తప్పిన ఈఎంయూ బోగీలు

చెన్నై: తమిళనాడులోని చెన్నైకు సమీపంలో గల అవడి వద్ద ఎలక్ట్రికల్ మల్టీ యూనిట్(ఈఎంయూ) మూడు ఖాళీ బోగీలు మంగళవారం పట్టాలు తప్పాయి. దీంతో చాలా పాసింజర్ సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. ఉదయం 5.40 గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ప్రాథమికంగా నాలుగు బోగీలు పట్టాలు తప్పినట్లు చెప్పినా తర్వాత మూడు మాత్రమే పట్టాలు తప్పినట్లు దక్షిణ రైల్వే నిర్ధారించింది. అవడి ఈఎంయూ కార్ షెడ్ నుంచి మెయిన్ లైన్‌కు వెళుతుండగా అవడి రైల్వే స్టేషన్ వద్ద ఈఎంయూ రైలు ఖాళీ బోగీలు పట్టాలు తప్పినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. దీంతో చెన్నై సెంట్రల్‌కు వెళ్లే సబర్బన్ లైన్‌లో రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఎక్స్‌ప్రెస్ లైన్‌కు కొద్ది ఆటంకం కలిగింది.

యువతను నిర్లక్ష్యం చేస్తే గుణపాఠమే

యువ సంఘర్ష యాత్ర ప్రారంభిస్తూ పవార్ హెచ్చరిక

పూనె: యువతను నిర్లక్ష్యం చేస్తే ఏ ప్రభుత్వానికైనా గుణపాఠం తప్పదని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ హెచ్చరించారు. అధికారం తిరిగి తమ చేతుల్లోనే ఉండాలని కోరుకునే ప్రభుత్వ పెద్దలు యువ సంఘర్ష యాత్ర(పాదయాత్ర) చేస్తున్న యువతను నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. మహారాష్ట్రలో యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ శరద్ పవార్ మనవడు, ఎన్‌సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ నాయకత్వంలో మంగళవారం యువ సంఘర్ష యాత్ర ప్రారంభమైంది. యాత్రను శరద్ పవార్ జెండా ఊపి ప్రారంభించారు. పూనెలో ప్రారంభమైన యాత్ర 13 జిల్లాల మీదుగా 45 రోజులు...800 కిలోమీటర్లు ప్రయాణించి...అసెంబ్లీ శీతాకాల సమావేశాల నాటికి నాగపూర్ చేరుకుంటుంది. 'యాత్ర రాష్ట్ర యువతను ప్రోత్సహిస్తుంది. యువ సంఘర్ష యాత్ర ద్వారా యువత కలలు, డిమాండ్లు నెరవేరతాయని ఆశిస్తున్నా. యువత సంఘర్ష యాత్ర ఫలితంగా కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది' అని శరద్ పవార్ చెప్పారు. 'యాత్ర నాగపూర్ చేరేనాటికి...తిరిగి అధికారం తమ చేతుల్లోనే ఉండాలని కోరుకునే ప్రభుత్వ పెద్దలు శాంతియుతంగా, ప్రజాస్వామ్యపద్ధతిలో యాత్ర చేస్తున్న యువతను నిర్లక్ష్యం చేయబోరు. యువతను నిర్లక్ష్యం చేస్తే పాలకులు భారీ మూల్యం చెల్లించకతప్పదు' అని శరద్ పవార్ స్పష్టంచేశారు. విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయరాదని, తల్లిదండ్రులు ముందుగానే చెల్లించిన అధిక ఫీజులు తిరిగి ఇవ్వడంతా పాటు అనేక డిమాండ్లను యువత ప్రభుత్వం ముందు పెట్టిందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, ప్రొఫెసర్ల ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, ఎంపీఎస్‌సీ ద్వారానే నియామక ప్రక్రియ చేపట్టాలని, ఛత్రపతి సంభాజీనగర్, సోలాపూర్, కొల్హాపూర్, అమరావతి వంటి ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల దత్తత పథకాన్ని, స్కూల్ క్లస్టర్ ప్రాజెక్టు చేపట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన గట్టిగా కోరారు. పరీక్ష పేపర్ల లీకేజీకి వ్యతిరేకంగా కఠినచట్టం రూపొందించాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభించాలని విద్యార్థులకు ఇచ్చిన రుణాలపై వడ్డీని మాఫీ చేయాలని శరద్ పవార్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'ఈ డిమాండ్ల సాధన కోసం యువత ఐక్యపోరాటం చేయాలి. డిమాండ్ల పత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేయాలి. మీరు కోరుకుంటే స్వయంగా నేను ముఖ్యమంత్రితో మాట్లాడతా. వ్యక్తిగతంగా నేను కూడా సమావేశంలో భాగస్వామినవుతా' అని యువతకు పవార్ భరోసా ఇచ్చారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి యువత అలుపెరగని పోరాటం చేయాలని సూచించారు.

'మీరు దిగ్విజయ్‌ని సీరియస్‌గా తీసుకుంటారా?

బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా

గ్వాలియర్ : మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల నుంచి తాను పారిపోయానని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ చేసిన వ్యాఖ్యను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం తోసిపుచ్చారు. 'మీరు దిగ్విజయ్ సింగ్‌ని సీరియస్‌గా తీసుకుంటారా?' అని మూడేళ్ల క్రితం కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన బీజేపీ నేత ప్రశ్నించారు. నియోజకవర్గం నుంచి బీజేపీ మాజీ ఎమ్మెల్యే వీరేంద్ర రఘువంశీకి టికెట్ ఇస్తామని హామీ ఇచ్చినా, శివపురి నుంచి కేపీ సింగ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని సింగ్ చేసిన వ్యాఖ్యలపై సింధియా ఇక్కడ విలేకరులను ప్రశ్నించారు. ఎందుకంటే, జ్యోతిరాదిత్య సింధియా శివపురి నుంచి బీజేపీ తరపున అభ్యర్థిగా పోటీ చేస్తారని అంతా భావించారు.

కానీ సింధియా, చివరికి 'భయంతో పారిపోయాడు' అని దిగ్విజయ్ సింగ్ సోమవారం అన్నారు. వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ ముగ్గురు కేంద్ర మంత్రులను రంగంలోకి దింపడం గమనార్హం. 2018లో బీజేపీకి చెందిన యశోధర రాజె సింధియా శివపురి నుంచి గెలుపొందారు. అయితే ఆరోగ్య కారణాల వల్ల ఆమె ఈసారి పోటీ చేయడానికి నిరాకరించారు. ఇదిలా ఉండగా శివపురి, అశోక్ నగర్‌కు చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు సింధియా సమక్షంలో బీజేపీలో చేరారు.

తుపానుగా మారిన అల్పపీడనం

'హమూన్'గా నామకరణం

న్యూఢిల్లీ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారింది. ఈ తుపానుకు 'హమూన్'గా పేరుపెట్టారు. తుపాను ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్‌లో వర్షాలు కురవనున్నాయి. బంగ్లాదేశ్‌లోని హెపుపరా, చిట్టాగాంగ్ మధ్య బుధవారం తీరందాటే అవకాశం ఉందని ఇక్కడి వాతావరణ కేంద్రం తెలిపింది. హమూన్ తుపాను కారణంగా భారత తీర ప్రాంతంపై అంతగా ప్రభావం ఉండకపోవచ్చని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమయి జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఒడిశాపై నేరుగా ప్రభావం మాత్రం ఉండదు. కానీ జాలర్లు ఎవరూ బుధవారం వరకూ వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. రాబోయే 12 గంటల్లో వాయువ్య బంగాళాఖాతంలో ఈ తుపాను మరింత బలపడి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. తుపాను కారణంగా రాబోయే రెండ్రోజుల్లో ఒడిశాలో ఓ మోస్తరు వర్షపాతం నమోదు కావొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. గాలులు కూడా వీస్తాయని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్థానిక వాతావరణ విభాగం వెల్లడించింది.

రోగి బంధువులపై దాడి

ముగ్గురు జూ.డాక్టర్ల సస్పెన్షన్

మీరట్ : చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొచ్చిన బాలుడి బంధువులపై దాడికి పాల్పడినందుకు పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత లాలా లజపతిరాయ్ మెమోరియల్ వైద్య కళాశాల ఆస్పత్రికి చెందిన ముగ్గురు జూనియర్ డాక్టర్లను సస్పెండ్ చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. దీనిపై విచారణకు కళాశాల ప్రిన్సిపాల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఐదేళ్ల చిన్నారి కునాల్ ఒక చేతికి గాయం కావడంతో ఆస్పత్రికి తరలించగా ఈ ఘటన చోటుచేసుకుంది. నలుగురైదుగురు జూనియర్ డాక్టర్లు బాలుడి కుటుంబ సభ్యులను కొట్టారని పోలీసుల ఫిర్యాదును ఉటంకిస్తూ సర్కిల్ ఆఫీసర్ అరవింద్ కుమార్ పీటీఐకి తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, పిల్లవాడు నొప్పితో ఏడుస్తున్నందున అతనికి 'సరైన చికిత్స' అందించాలని బంధువులు వైద్యులను కోరారు. దీంతో ఆగ్రహించిన వైద్యులతో పాటు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని, మహిళలు సహా కుటుంబ సభ్యులను కొట్టారని పోలీసులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా నిందితులైన వైద్యులు పరారయ్యారని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, రోగి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వైద్యులపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 147(అల్లర్లు), 323 (స్వచ్ఛందంగా గాయపరచడం), 504 (ఉద్దేశపూర్వకంగా అవమానించడం), 506 (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేసినట్లు కుమార్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎల్ఎల్ఆర్ఎం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.సి.గుప్తా తెలియజేస్తూ, చిన్నారి బొటన వేలికి గాయమైందని, గాయం లోతును పరిశీలించేందుకు వైద్యులు ఫోటోలు తీస్తున్నారని తెలిపారు.

అయితే ఫొటోలు తీస్తున్న మొబైల్ ఫోన్‌ను కుటుంబ సభ్యులు లాక్కెళ్లి చిన్నారికి చికిత్స అందించాలని వైద్యులను కోరారు. దీంతో వాగ్వాదం జరిగి వెంటనే ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోను పరిగణనలోకి తీసుకుని ముగ్గురు జూనియర్ డాక్టర్లను సస్పెండ్ చేశామని, ఘటనపై విచారణకు విచారణ కమిటీని ఏర్పాటు చేశామని గుప్తా తెలిపారు.

విద్యార్థులపై లైంగిక వేధింపులు

గుజరాత్‌లో మదర్సా టీచర్ అరెస్ట్

అహ్మదాబాద్ : పది మంది మైనర్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గుజరాత్‌కు చెందిన జునాగఢ్ జిల్లాలోని ఒక మదర్సాకు చెందిన 25 ఏళ్ల ఉపాధ్యాయుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మౌలానా (ఉపాధ్యాయుడు) తో పాటు ఉపాధ్యాయుడిపై విద్యార్థులు చేసిన ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ మదర్సా 55 ఏళ్ల ట్రస్టీని కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు జునాగఢ్ జిల్లా పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుడిని సూరత్‌లోని అతని రహస్య ప్రదేశం నుంచి పట్టుకోగా, తప్పించుకోజూసిన మదర్సా ట్రస్టీని ఆదివారం జునాగఢ్‌లోని ఒక ప్రదేశం నుంచి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. 17 ఏళ్ల బాలుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగ్రోల్ పోలీసులు ఇద్దరు నిందితులపై లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం సంబంధిత నిబంధనలు భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 377 (అసహజ సంభోగం), 323 (దాడి), 506-2 (నేరపూరిత బెదిరింపు) కింద ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగ్రోల్-వెరావల్ బైపాస్‌లోని రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి ఒకరు కొద్దిరోజుల క్రితం మరో మౌలానా మొబైల్ ఫోన్‌తో తన తల్లికి ఫోన్ చేసి టీచర్ లైంగిక సంజ్ఞలు, విద్యార్థులతో ప్రవర్తించిన తీరుపై ఫిర్యాదు చేయడంతో ఈ నేరం వెలుగులోకి వచ్చిందని ఆ ప్రకటన వివరించింది. ఆ తర్వాత మహిళ పోలీసులను ఆశ్రయించి, పాఠశాలలో నివసిస్తున్న, చదువుతున్న విద్యార్థులపై మదర్సా ఉపాధ్యాయుడు స్వలింగ సంపర్కం, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించినట్లు చెప్పారు.

అక్టోబరు 21న పోలీసులు ప్రాంగణానికి చేరుకుని, కొంతమంది ముస్లిం నాయకుల సహాయంతో విద్యార్థులను ఆరా తీయగా, మదర్సాలో చదువుతున్న 10 మంది అబ్బాయిలు ముందుకు వచ్చి, నిందితుడైన ఉపాధ్యాయుడు తమను 'లైంగికంగా వేధించాడు' అని, ఎవరైనా విద్యార్థి వారి తల్లిదండ్రులకు లేదా బయటి వ్యక్తికి ఫిర్యాదు చేస్తే వారిని చంపేస్తానని బెదిరించాడని ఆరోపించారు. ఉపాధ్యాయుడి నుంచి తమను రక్షించాలంటూ విద్యార్థులు మదర్సా ట్రస్టీని సంప్రదించగా, అతను ఎటువంటి చర్య తీసుకోలేదని పోలీసులు కూడా తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడిపై కేసు పెడతామని ట్రస్టీ గ్రహించడంతో అతను ఆ స్థలం నుంచి పారిపోవడానికి అతను సహాయం చేసినట్లు పోలీసులు తెలిపారు.

విచారణలో భాగంగా జునాగఢ్ పోలీస్ సూపరింటెండెంట్ హర్షద్ మెహతా మదర్సాను సందర్శించి, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరుపుతారని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

వక్రీకరణలు రూపుమాపాలి

ప్రధాని మోదీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ప్రతి చెడు అంశంపైనా దేశభక్తి సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సమాజంలోని కులతత్వం, ప్రాంతీయతత్వం వంటి వక్రీకరణల్ని రూపుమాపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ద్వారకా సెక్టార్- 10లో రామ్‌లీలా మైదానంలో మంగళవారం నిర్వహించిన 'రావణ్ దహన్' కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ వేడుకకు భారీగా తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. శతాబ్దాల నిరీక్షణ తర్వాత అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించడం ప్రతిఒక్కరికీ కలిగిన అదృష్టంగా పేర్కొన్నారు. మరికొద్ది నెలల్లో అయోధ్య రామమందిరం నిర్మాణం పూర్తయి ప్రజల సహనం సాధించిన విజయానికి గుర్తుగా నిలుస్తుందన్నారు. అనేక శుభపరిణామాల మధ్య దసరా వేడుకల్ని జరుపుకొంటున్నామన్న ప్రధాని చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడం, కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం, మహిళా రిజర్వేషన్‌బిల్లు ఆమోదించడం వంటి అంశాలను ప్రస్తావించారు. 'విజయ దశమి రోజున అందరూ భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ చేస్తారు. ఆత్మ రక్షణ కోసమే భారత్ ఆయుధాలు వాడుతోంది. ఇతర దేశాలపై ఆధిపత్యం మా విధానం కాదు. విశ్వమానవ సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ దసరా రోజు శక్తి పూజ చేస్తాం" అని తెలిపారు. కనీసం ఒక్క పేద కుటుంబం సామాజిక-ఆర్థిక స్థితిని మెరుగుపరచడంతో పాటు 10 ప్రతిజ్ఞలు తీసుకోవాలని ఈ సందర్భంగా మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందరూ అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. నీటి ఆదా, డిజిటల్ లావాదేవీలు, స్వచ్ఛత పాటించడం, వోకల్ ఫర్ లోకల్, పనిలో నాణ్యత, దేశీయ పర్యాటకం, ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల వినియోగం, ఫిట్‌నెస్ అంశాలను ప్రోత్సహించాలని కోరారు.

గిరిజన మహిళపై మహా దారుణం

బీజేపీ ఎమ్మెల్యే భార్య, ముగ్గురిపై కేసు

ముంబై: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అంతులేని దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. మహారాష్ట్రలో గిరిజన మహిళను నడిరోడ్డుపై వివస్త్ర చేసి కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావటంతో బీజేపీ ఎమ్మెల్యే భార్య సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఓ గిరిజన మహిళ రోడ్డుపై బట్టలు లేకుండా నడుస్తున్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది.తన పూర్వీకుల భూమిని తన అనుచరుల సహాయంతో లాక్కోవాలని బీజేపీ ఎమ్మెల్యే భార్య చూస్తున్నారని బాధిత మహిళ తెలిపారు. సుమారు 70 ఏళ్లుగా ఉన్న తమ భూమిని గుంజుకోవాలని చూస్తున్నారన్నారు. తన భార్యపై వచ్చిన ఆరోపణలన్నింటినీ ఎమ్మెల్యే సురేష్ దాస్ తోసిపుచ్చారు. అదంతా అబద్ధమని బుకాయించారు. సురేశ్ దాస్ భార్య ప్రజక్తా సురేశ్ దాస్, రాహుల్ జగ్దాలే, రఘు పవార్‌లపై ఐపీసీ సెక్షన్ 354, 354 బీ, 323, 504, 506, 354 ఏ, 34, షెడ్యూల్డ్ కులాలు, తెగల చట్టం కింద కేసు నమోదైంది.

సీఎం ఒకలా.. గణాంకాలు ఇంకోలా

నిరుద్యోగంపై హరియాణాలో ఖట్టర్ సర్కారు అవాస్తవాలు

చండీగఢ్ : బీజేపీ పాలిత రాష్ట్రం పరియాణాలో నిరుద్యోగం ఆందోళన కలిగిస్తున్నది. అధికారిక గణాంకాల ప్రకారం భారత్‌లోని పెద్ద రాష్ట్రాల్లో అత్యధిక నిరుద్యోగం కలిగిన రెండో రాష్ట్రంగా హర్యానా ఉన్నది. అయినప్పటికీ, అక్కడి ప్రభుత్వం మాత్రం నిజాలను దాచిపెడుతున్నది. రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతున్నదని ప్రచారాలు చేసుకుంటున్నది. ఈ అంశమే ఇప్పుడక్కడి అధికారి, ప్రతిపక్షాల మధ్య నిప్పు రాజేస్తున్నది. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటంలో భాగంగానే ఇలా అవాస్తవాలు ప్రచారం చేసుకుంటున్నదని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నాయి. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు కల్పించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతున్నదని పేర్కొంటున్నాయి. 2022 జులై నుంచి 2023 జూన్ వరకు ఉన్న జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) సమాచారం ప్రకారం హర్యానాలో నిరుద్యోగం రేటు 6.1 శాతంగా (పట్టణ, గ్రామీణ ప్రాంతాలు కలుపుకొని) ఉన్నది. ఇక్కడ పట్టణ నిరుద్యోగ రేటు 6.5 శాతంగా ఉన్నది. అయితే, మనోహర్‌లాల్‌ఖట్టర్ సర్కారు రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 6.1 శాతానికి తగ్గిందనీ, తమ ప్రభుత్వం నిర్విరామంగా తీసుకుంటున్న చర్యల కారణంగానే ఇది సాధ్యమైందని చెప్పుకుంటున్నది. 2014లో మనోహర్‌లాల్ ఖట్టర్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి రాష్ట్రంలోని యువతకు 1.10 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

ప్రభుత్వం వాదనలను అక్కడి ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికీ నిరుద్యోగం ఆల్ టైమ్ గరిష్టంగా ఉన్నదని అంటున్నాయి. "15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సున్నవారిలో ప్రభుత్వం నిరుద్యోగ రేటును చూడాలి. అది 17.5 శాతంగా ఉన్నది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి యువతకు ఉద్యోగాలు అందటం లేదు. 2019లో ఆయన రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే యువతకు కల్పించారు' అని హర్యానా అసెంబ్లీలో ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్ర స్థాయిలో ఉన్నదని హర్యానా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దివ్యాన్షు బుధిరాజ విమర్శించారు.

ఐఐటీ కోచింగ్ విద్యార్థి ఆత్మహత్య

బలియా(యూపీ): రాజస్తాన్‌లోని కోటలో ఐఐటీ కోసం శిక్షణ తీసుకుంటున్న 20 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కోటలో శిక్షణ తీసుకుంటున్న ఆ విద్యార్థి ఇటీవల తన స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్‌కు వచ్చాడు. ఇంటిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు మంగళవారం వెల్లడించారు. రోషన్ వర్మ అనే విద్యార్థి ఇటీవల బలియా జిల్లా దేవకీ చాప్రా వచ్చాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులందరితో కలిసి వరండాలో పండుకున్నాడు. రాత్రివేళ లేచి తన గదిలోకి వెళ్లాడు. ఫ్యాన్‌కు టవల్‌తో ఉరేసుకొని చనిపోయాడు. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత రోషన్ కోటలో ఐఐటీకి కోచింగ్ తీసుకుంటున్నాడు. దసరా సెలవుల కారణంగా సొంతూరు వచ్చాడు. రోషన్ ఉరేసుకొని చనిపోవడాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం గుర్తించారు. కాగా, గడచిన కొంతకాలంగా రోషన్ తలనొప్పితో బాధపడుతున్నాడని, అతనికి వైద్య సేవలు అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తలనొప్పి భరించలేక రోషన్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడని ఎస్ఐ ధరంవీర్ సింగ్ చెప్పారు.

మళ్లీ గెలిస్తే కులగణన చేపడతాం: బఘేల్

రాయ్‌పూర్: కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికార పగ్గాలు చేపడితే రాష్ట్రంలో కులగణన చేపడుతుందని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ హామీ ఇచ్చారు. రైతుల రుణాలను మాఫీ చేస్తామని ఆయన ట్విట్టర్ వేదికగా వాగ్దానం చేశారు. రుణమాఫీతో రాష్ట్రంలోని 22 లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. 17.5 లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలందరికీ మేలు చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అధికారం నిలుపుకునేందుకు పాలక కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతుండగా, ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకుని అందలం ఎక్కాలని కాషాయ పార్టీ చెమటోడుస్తోంది. చత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7, 17న రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

న్యూస్‌క్లిక్ కేసులో రైతులపై అభియోగాలా?

- 6న విజయవాడలో నిరసనను జయప్రదం చేయండి
- రైతు సంఘాలు-కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): న్యూస్‌క్లిక్ ఎఫ్ఐఆర్‌లో రైతులపై మోపిన ఆరోపణలు ఉపసంహరించుకోవాలని, విశాఖ ఉక్కు ఉద్యమం 1000 రోజులకు చేరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి వ్యతిరేకంగా నవంబర్ 6న విజయవాడలో నిరసన తెలియజేయాలని రైతు సంఘాలు-కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘాలు-కార్మిక సంఘాల ఐక్య సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నవంబర్ 27, 28న చేపట్టనున్న కార్యక్రమాల కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో అన్ని పంటలకు చట్టబద్ధ మద్దతు ధరల ప్రకటించాలని, విద్యుత్ బిల్లు 2020 రద్దు చేయాలని, మూడు వ్యవసాయ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన రైతు ఉద్యమానికి న్యూస్‌క్లిక్ యాజమాన్యం విదేశీ నిధులు అందించిందని ఎఫ్ఐఆర్‌లో మోదీ ప్రభుత్వం ఆరోపించడం దుర్మార్గమని విమర్శించారు. కేంద్రప్రభుత్వం తక్షణమే రైతాంగానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నవంబర్ 6న విజయవాడలో నిరసన కార్యక్రమం జరుగుతుందని, సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాలలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ వెయ్యి రోజుల నుంచి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కారు పదేళ్ల కాలంలో కొత్త ఉద్యోగాల ఊసే లేదని, ఉపాధి గురించి కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వరంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసమే కృష్ణా జలాల పునఃపంపిణీ అంశాన్ని కేంద్రం తెరపైకి తీసుకొచ్చిందని ఆరోపించారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికులు, రైతులు ఐక్య ఉద్యమాల ద్వారా మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజాకంటక విధానాలు అనుసరిస్తోందని, మతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలిక తెస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలో 324 మండలాల్లో కరువు నెలకొన్నదని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఖరీఫ్‌లోనే 30 లక్షల ఎకరాల్లో పంటలు వేయలేదని, వేసిన పంటలకు నీరందక దెబ్బతింటున్నాయని తెలిపారు. రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ కరువు పరిస్థితిని ఎదుర్కోవటానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరు రంగారావు, ఇప్టా రాష్ట్ర నాయకులు ఎం.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడు యల్లమందారావు, మహిళానేత బి.పద్మ పాల్గొన్నారు.

ఐక్యతా సందేశమే ఉద్దేశం

2న సీపీఐ 'బీజేపీ హటావో దేశ్ బచావో'

'ఇండియా'కు మద్దతుగా బీహార్‌లో ర్యాలీ, బహిరంగ సభ

పాట్నా: కేంద్రంలోని ఎన్డీయేను గద్దె దించేందుకు ఏర్పడిన ప్రతిపక్షాల ఇండియా కూటమి బలంగా ఉందని, తామంతా ఐక్యంగా ముందుకెళుతున్నామని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలిపింది. రాజకీయ ఐక్యతా సందేశమివ్వడమే ఉద్దేశంగా 'బీజేపీ హటావో దేశ్ బచావో' పేరుతో నవంబరు 2న బీహార్‌లో ర్యాలీకి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పిలుపునిచ్చింది. ప్రతిపక్షాల ఇండియా కూటమికి, రాష్ట్రంలోని మహాకూటమికి సంపూర్ణ మద్దతు తెలియజేయడం, తమ బలాన్ని ప్రదర్శిస్తూ ఐక్యతా సందేశమివ్వడమే ఈ ర్యాలీ లక్ష్యంగా తెలిపింది. అలాగే రాజధాని పాట్నాలో బహిరంగ సభను సీపీఐ నిర్వహించనుంది. ఈ సభలో జేడీయూ అధ్యక్షుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు వామపక్షాల నాయకులు ప్రసంగిస్తారు. కూటమి మిత్రపక్షం బీహార్‌లో నిర్వహించే తొలి బహిరంగ సభ ఇదే కాబోతోంది. తమ మిత్రపక్షాలైన సీపీఎం, సీపీఐ(ఎంఎల్), సీపీఐ (మార్క్సిస్టు లెనినిస్ట్)తో పాటు కాంగ్రెస్, జేడీయూ, ఆర్జేడీ తదితర పార్టీలకు ఆహ్వానాలను పంపామని, నితీశ్ కుమార్ ఆహ్వానాన్ని స్వీకరించగా, లాలూ, తేజస్వీ కూడా హాజరవుతారని ఆకాంక్షిస్తున్నట్లు పార్టీ తెలిపింది. 'మహాకూటమి మిత్రపక్షాలు అన్నింటినీ ఆహ్వానించాం. నితీశ్ కుమార్ మా ఆహ్వానాన్ని స్వీకరించారు. లాలూ, తేజస్వి కూడా పాల్గొంటారు' అని సీపీఐ బీహార్ కార్యదర్శి రామ్‌నరేశ్ పాండే 'న్యూస్‌క్లిక్'కు వెల్లడించారు. ర్యాలీ ఏర్పాట్లలో వందల మంది పార్టీ నాయకులు, కార్మికులు నిమగ్నమయ్యారని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలు కూడా ర్యాలీలో పాల్గొనే విధంగా రాష్ట్ర ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలావుంటే నవంబరు 5న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బీహార్‌లో పర్యటిస్తారు. ముజఫర్‌పూర్‌లో నిర్వహించే బీజేపీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 16 జిల్లాల పార్టీ అధ్యక్షులతోనూ అదే రోజు సమావేశమవుతారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, రాబోయే ఎన్నికలకు వ్యూహాలను చర్చిస్తారు.

మణిపూర్ సంక్షోభాన్ని మోదీ పూర్తిగా విస్మరించారు

న్యూఢిల్లీ : మేలో హింస చెలరేగినప్పటి నుంచి మణిపూర్‌లో పర్యటించనందుకు ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మంగళవారం మరోసారి విమర్శల దాడి చేసింది. ఆయన జోక్యం, అక్కడ పర్యటించాల్సిన అత్యంత అవసరమైన సమ యంలో రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించాడని తెలిపింది. మణిపూర్‌లో సామాజిక సామరస్యం చెడిపోయి నేటికి 175వ రోజు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. కానీ మణిపూర్ ప్రజలు, రాష్ట్రంలో సయోధ్య, విశ్వాసాన్ని పెంపొందించే ప్రక్రియ ఊపందుకో వాలని కోరుకునే వారందరూ ఐదు ప్రశ్నలు అడుగుతూనే ఉన్నారు' అని ఆయన 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'మణిపూర్, మొత్తం ఈశాన్య ప్రజలు తన జోక్యం అత్యంత అవసరమైన సమయంలో మణిపూర్ రాష్ట్రాన్ని ఎలా విడిచిపెట్టారో నిశితంగా గమనిస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు. 'ఈ సంక్షోభాన్ని పూర్తిగా విస్మరించడం ద్వారా ఆయన జవాబుదారీతనం, బాధ్యత నుంచి తప్పించుకోలేడు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రిని, రాష్ట్రానికి ఎన్నికైన ఎమ్మెల్యేలను ప్రధాని ఎందుకు కలవలేదని, వారిలో ఎక్కువ మంది ఆయన పార్టీకి చెందినవారు లేదా దాని మిత్రపక్షాలు అని జైరాం రమేశ్ అన్నారు. లోక్‌సభలో మణిపూర్ (ఇన్నర్) నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి ప్రధాన మంత్రిని ఎందుకు కలవలేకపోయారని కూడా ప్రశ్నించారు. 'అన్ని విషయాలపై బోధనలు చేసే ప్రధాన మంత్రి మణిపూర్‌పై గరిష్ఠంగా 4 నుంచి 5 నిమిషాల కంటే ఎక్కువసేపు బహిరంగంగా మాట్లాడటం ఎందుకు సరిపోతుందని భావించలేదు. అది కూడా సాధారణ పద్ధతిలో, ప్రతిపక్షాల నుంచి విపరీతమైన ఒత్తిడి తర్వాత? మణిపూర్‌లో తన ఆందోళనను తెలియజేసేందుకు కొన్ని గంటలు కూడా గడపడం తగదని ప్రధాని ఎందుకు చూడలేదు. మణిపూర్‌లోని సమాజంలోని వర్గాలలో అంతగా పరువు పోగొట్టుకున్న సీఎంను ఇంకా ఎందుకు కొనసాగించడానికి అనుమతిస్తున్నారు' అని కూడా కాంగ్రెస్ ఎంపీ ప్రశ్నించారు. మణిపూర్ సంక్షోభంలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ పరిస్థితిని అదుపు చేయలేకపోతున్నారని ఆరోపిస్తూ ఆయనను బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష పార్టీ కూడా డిమాండ్ చేస్తోంది.

మిషన్ లోపమా... పోలీసు అత్యుత్సాహమా?

విశాఖ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో విచిత్రం

విశాలాంధ్ర- విశాఖ సిటీ: మిషన్ లోపమో...పోలీసుల అత్యుత్సాహమో తెలియదు గానీ ఓ అమాయకుడిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇరికించే ప్రయత్నం విశాఖలో సోమవారం జరిగింది. చివరికి మిషన్ లోపమనే సాకుతో పోలీసులు అతడిని వదిలిపెట్టారు. వివరాల్లోకి వెళితే... దసరా పండుగ పూజ సామగ్రి కొనుగోలుకు ఓ వ్యక్తి సోమవారం సాయంత్రం జగదాంబ సెంటర్ మీదుగా పూర్ణ మార్కెట్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. జగదాంబ జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అక్కడ ఆ వ్యక్తిని ఆపిన ట్రాఫిక్ పోలీసులు మిషన్‌తో పరీక్షించారు. మిషన్‌ను నోటి వద్ద పెట్టి గట్టిగా గాలి ఊదమన్నారు. మద్యం సేవించినట్లు మిషన్ చూపించిందన్న సాకుతో అతని బండి లాక్కొని పక్కన నిలబెట్టారు. దీంతో కంగుతిన్న వ్యక్తి...తానేమీ మద్యం సేవించలేదని మొరపెట్టుకున్నాడు. అయినప్పటికీ వినిపించుకోని ట్రాఫిక్ పోలీసు 'మీరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నారు. కేసు నమోదు చేస్తాం' అని బెదిరించారు. దీంతో ఆ వ్యక్తి బాధతో తానే మద్యం సేవించలేదని, ఏ పరీక్షకైనా సిద్ధమంటూ మొండికేశాడు. అవసరమైతే నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పాడు. దీంతో దిగివచ్చిన పోలీసులు తమను సమర్థించుకునేందుకు వింత వాదన తెరపైకి తీసుకువచ్చారు. తొలుత ఊదితే ఆల్కహాల్ సేవించినట్టు మిషన్ చూపించిందని, రెండోసారి తక్కువ మోతాదు చూపించిందని, మరోసారి ఆల్కహాల్ సేవించలేదని చూపిందని విచిత్ర వాదన అందుకున్నారు. మద్యం సేవించిన 24 గంటల వరకు పరీక్షల్లో పాజిటివ్ వస్తుందని ఒకసారి, మిషన్ రెండు మూడు సార్లు చెక్ చేస్తేనే నిర్ధారణ అవుతుందని చెప్పుకొచ్చారు. పోలీసులు పొంతన లేకుండా సమాధానం చెబుతూ విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు. చివరిగా నాలుగైదుసార్లు మిషన్‌తో పరీక్షించినా మద్యం సేవించిన ఆధారాలు లభించలేదు. దీంతో అతనిని విడిచిపెట్టారు.

ఇలాంటి ఘటనలు అరుదు: అదనపు డీసీపీ

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో ఈ తరహా ఘటనలు చాలా అరుదుగా చోటుచేసుకుంటాయని విశాఖ ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాసరావు తెలిపారు. ఓ తరహా అనారోగ్య సమస్య ఉన్నవారికి తినే ఆహార పదార్థాలు చాలావరకు జీర్ణం కాక, అవి పులిసి ఓ రకమైన వాయువులు తయారవుతాయని, ఆ సమయంలో మిషన్‌తో గాలి పీలిస్తే మద్యం సేవించినట్లు చూపిస్తుందని చెప్పుకొచ్చారు. ఇలాంటి ఘటనలు అరుదుగా ఉంటాయన్నారు. ఇందులో ఏదో పొరపాటు జరిగినట్లు ఉందని, పూర్తి వివరాలు తెలుసుకొని చెబుతామన్నారు.

హమాస్‌పై కలిసి పోరాడుదాం

నెతన్యాహుతో భేటీలో మాక్రాన్

జెరూసలేం: హమాస్‌పై పోరు నెపంతో గాజాపై ఇజ్రాయిల్ ఏకపక్ష దండయాత్రను అమెరికా, దాని మిత్రపక్షాలు సమర్థిస్తూ యూద దేశానికి అండగా నిలుస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ అధినేతలు ఇజ్రాయిల్‌లో పర్యటించి తమ మద్దతును ప్రకటించగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేట్ మాక్రాన్ కూడా మీకు మేమున్నాం అంటూ అభయమిచ్చారు. ఆయన మంగళవారం ఇజ్రాయిల్‌లో పర్యటించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కలిశారు. మన శత్రువు ఒక్కటే.. హమాస్‌పై పోరులో మీరు ఒంటరిగా లేరు అని నెతన్యాహుతో మాక్రాన్ అన్నారు. తాజా దాడుల్లో 30 మంది ఫ్రాన్స్ పౌరులు మరణించి నట్లు ఆయన తెలిపారు. ఐఎస్ఐఎల్-ఐఎస్ఐఎస్‌పై పోరాటంలో కూటమిగా ఏర్పాటు కావాలని ప్రతిపాదన చేశారు. దాయేష్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ కూటమిలో భాగస్వామి అయ్యేందుకు ఫ్రాన్స్ సిద్ధంగా ఉందని తెలిపారు. పశ్చిమాసియా సుస్థిరత గురించీ నెతన్యాహుతో చర్చించారు. పలస్తీనా ప్రజలతో ఘర్షణ పరిష్కారానికి రాజకీయంగా ముందుకెళ్లేందుకు ఇజ్రాయిల్ అంగీకరిస్తే పశ్చిమాసియాలో సుస్థిరత సాధ్యం కాగలదని మాక్రాన్ నొక్కిచెప్పారు.

17 రోజుల్లో 2వేల మంది చిన్నారుల మృతి

గాజా: పలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ రోజురోజుకూ తీవ్రమవుతోంది. వైమానిక దాడులతో విరుచుకుపడుతూ గాజా స్ట్రిప్‌లో మారణ హోమాన్ని ఆ దేశం సృష్టిస్తోంది. భూతల దాడులకూ ముందడుగు వేసింది. ఏకపక్షంగా జరుపుతున్న ఈ దాడుల్లో ఇప్పటివరకు వేలాది మంది పలస్తీనా పిల్లలు మృత్యువాత పడ్డారు. 17 రోజుల్లో 2వేల మంది చనిపోయారు. ఈ మేరకు మానవతా సంస్థ 'సేవ్ ది చిల్డ్రన్' ఓ ప్రకటన చేసింది. గగనతలం నుంచి కురిపిస్తున్న బాంబుల వర్షానికి గాజా శిథిలమైందని, ఎటు చూసినా కుప్పకూలిన భవనాలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. వెస్ట్‌బ్యాంక్‌లో 27 మంది చిన్నారులు మరణించినట్లు తెలిపింది. పసిప్రాణాలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాలకు పిలుపునిచ్చింది. పిల్లలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరింది. వారి ప్రాణాలు కాపాడేందుకు సాధ్యమైనదంతా చేయాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే 20 లక్షల మందికిపైగా గాజాను వీడగా, ఆహారం, నీళ్లు, విద్యుత్, ఇంధన తదితరాల సరఫరా నిల్చిపోయింది.

చైనా రక్షణ మంత్రి లీ షాంగ్ఫూ తొలగింపు

మరో ఇద్దరు మంత్రులు కూడా



తైపే (తైవాన్): చైనా రక్షణ మంత్రి లీ షాంగ్ఫూను పదవిలో నుంచి తొలగిస్తూ జిన్‌పింగ్ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అలాగే సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి వాంగ్ ఝిగాంగ్, ఆర్థిక మంత్రి లియూ కున్‌పైనా వేటు పడింది. ఆ శాఖల ప్రస్తుత కార్యదర్శులు యిన్ హేజున్, లాన్ ఫో అన్ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపినట్లు సీసీటీవీ పేర్కొంది. ఇదిలావుంటే లీషాంగ్ఫూ రెండు నెలలుగా ఆచూకీ లేరు. ఈ ఏడాది కనిపించకుండా పోయిన రెండవ ఉన్నతాధికారి ఈయనే. ఆగస్టు 29వ తేదీ ప్రసంగం తర్వాత ఆయన జాడలేరు. అయితే ఈయన స్థానంలో ఎవరికి రక్షణశాఖ బాధ్యతలు అప్పగిస్తున్నది మాత్రం జిన్‌పింగ్ ప్రభుత్వం ప్రకటించలేదు. అంతకుముందు విదేశాంగ శాఖ మాజీ మంత్రి క్విన్ గాంగ్ గల్లంతు, జులైలో తగిన కారణాలు చూపకుండానే పదవిలో నుంచి తొలగించడం తెలిసిందే. క్విన్‌ను తొలగించిన తర్వాత చైనా కేబినెట్‌పై అనేక ఊహాగానాలు వచ్చాయి. ఈ క్రమంలో తాజా ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది మార్చిలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇదే క్రమంలో రక్షణ మంత్రిగా లీ షాంగ్ఫూ బాధ్యతలు స్వీకరించారు. అయితే చైనాలో మారిన విదేశాంగ లేదా రక్షణ విధానాల క్రమంలో క్విన్‌గానీ లీగానీ గల్లంతైనట్లు ఆధారాలు లేవు. 24వ తేదీన జరిగిన పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 14వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ స్థాయి సంఘం ఆరవ సమావేశంలో లీ షాంగ్ఫూను రక్షణ మంత్రిగా, కౌన్సిల్ సభ్యునిగా తొలగించాలనే నిర్ణయించినట్లు అధికారిక ప్రకటన తెలిపిందని సీసీటీవీ నివేదించింది.

ఓటర్ల జాబితాలో జోక్యం

బాపట్లలో నలుగురు పోలీసులపై వేటు

- నిబంధనలు అతిక్రమించిన సీఐ, ముగ్గురు ఎస్సైల సస్పెన్షన్
- పోలీసు యంత్రాంగానికి ఈసీ పరోక్ష హెచ్చరికలు

ఫిరోజ్, సీఐ

కె.ఆనూక్, ఎస్సై

చెంచుప్రసాద్, ఎస్సై

కమలాకర్, ఎస్సై

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఓటరు జాబితాలో జోక్యం చేసుకుని ఫారం-7 సమాచారాన్ని వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని సేకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలను విచారణ అనంతరం పోలీస్ శాఖ సస్పెండ్ చేసింది. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోర్టును ఆశ్రయించారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా 14 వేల ఓట్లను తొలగించేందుకు మార్టూరు సీఐ ఫిరోజ్, మార్టూరు ఎస్సై కమలాకర్, పర్చూరు ఎస్సై చెంచుప్రసాద్, యద్దనపూడి ఎస్సైగా పని చేసి వీఆర్‌లో ఉన్న కె.ఆనూక్ జోక్యం చేసుకుని బీఎల్‌ఓలపై ఒత్తిడి చేసి ఓట్లు తొలగించేందుకు ప్రణాళికలు చేస్తున్నారని, అర్హులైన ఒక్క ఓటును తొలగించేందుకు వీలులేదంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఓట్లు తొలగించేందుకు వినియో గించిన సిమ్ కార్డు రాకెట్ ఉదంతాన్ని, ఎన్నికల విధుల్లో లేని పోలీసులచే ఓట్లు తొలగించేందుకు చేసిన కుట్రలను సాక్ష్యాధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఏలూరి అందజేశారు. అయితే, ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ఇదే విషయంపై హైకోర్టును ఆశ్రయించటంతో న్యాయస్థానం ఆదేశాలతో ఎన్నికల అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం ఫారం-7 దరఖాస్తులపై విచారణ చేపట్టి 17 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ నెల 21న గుంటూరు ఐజీ పాలరాజు మార్టూరు సీఐ, మార్టూరు ఎస్సై, పర్చూరు ఎస్సై, అప్పటి యద్దనపూడి ఎస్సైలను స్వయంగా విచారణ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని తేలటంతో సోమవారం నలుగురినీ వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఎన్నికల సంఘం పరోక్షంగా అసంతృప్తి వ్యక్తం చేయటంతో పాటు ఎమ్మెల్యే ఏలూరి అవకతవకలకు పాల్పడిన వారిని సస్పెండ్ చేయకపోతే కోర్టును ఆశ్రయిస్తానని మీడియా ముందు తెలపటంతో మంగళ వారం నలుగురినీ పోలీస్ శాఖ సస్పెండ్ చేసింది. ఇది జిల్లాలో పోలీసు శాఖలో అలజడి సృష్టించింది. ఎన్నికల సంఘం పరోక్ష హెచ్చరికలతో పోలీసు అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

ఒడిశా సీఎం ప్రైవేటు కార్యదర్శికి కేబినెట్ హోదా

భువనేశ్వర్: ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ మాజీ సహాయకుడు వీకే పాండియన్ కేబినెట్ మంత్రి హోదాతో 5టీ (ట్రాన్స్‌ఫార్మేషనల్ ఇనిషియేటివ్స్) చైర్మన్‌గా నియమితులైనట్లు మంగళవారం అధికారిక ప్రకటన వెలువడింది. పాండియన్ ప్రభుత్వ ఉద్యోగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఒక రోజు తర్వాత ఈ పరిణామం జరిగింది. 'వీకే పాండియన్ 5టీ (ట్రాన్స్‌ఫార్మేషన్ ఇనిషియేటివ్స్) చైర్మన్‌గా ఒడిశా కేబినెట్ మంత్రి హోదాలో నియమితు లయ్యారు. పాండియన్ నేరుగా ముఖ్యమంత్రి అధ్వర్యంలో పని చేస్తారు' అని సాధారణ పరిపాలన, ప్రజా ఫిర్యాదుల విభాగం తెలిపింది. పాండియన్ రూపొందించిన 'అమా ఒడిశా, నబిన్ ఒడిశా' (మన ఒడిశా, న్యూ ఒడిశా) అనే రాష్ట్ర ప్రభుత్వ కొత్త పథకానికి కూడా ఆయన బాధ్యత వహిస్తారు. మాజీ ఐఏఎస్ అధికారి కూడా అధికార బీజేడీలో చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. పాండియన్ 2011లో ముఖ్య మంత్రి కార్యాలయం (సీఎంవో) లో భాగమయ్యారు. అప్పటి నుంచి ఆయన పట్నాయక్ ప్రైవేట్ కార్యదర్శిగా ఉన్నారు. 2019లో పట్నాయక్ ఐదవసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత, ప్రభుత్వ శాఖలలో కొన్ని పరివర్తన కార్యక్రమాలను అమలు చేయడానికి పాండియన్‌కు '5 టీ కార్యదర్శి'గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

బిషన్‌సింగ్ బేడీకి క్రికెట్ దిగ్గజాల నివాళి



న్యూఢిల్లీ: భారత క్రికెట్ దిగ్గజం, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ బిషన్‌సింగ్ బేడీ (77) కన్నుమూశారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. తన ఎడమ చేతి వాటం స్పిన్ బౌలింగ్‌తో ఆయన ప్రత్యర్థులను వణికించారు. బిషన్ సింగ్ బేడీ 67 టెస్టుల్లో 266 వికెట్లు తీశారు. బిషన్ సింగ్ బేడీ 22 మ్యాచ్‌లకు కెప్టెన్‌గానూ వ్యవహరించారు. 10 వన్డేల్లో ఏడు వికెట్లు తీశారు. అప్పట్లో భారత్ నుంచి అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరిగా గుర్తింపుపొందారు. స్పిన్ బౌలింగ్ రూప శిల్పులలో ఒకరిగా క్రికెట్‌లో తనదైన ముద్ర వేశారు. బిషన్‌సింగ్ బేడీ పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జన్మించారు. ఆయనకు భార్య అంజు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భారత్ తొలి వన్డే విజయంలో ఎరపల్లి ప్రసన్న, బీఎస్ చంద్రశేఖర్, ఎస్.వెంకట రాఘవన్‌లతో కలసి కీలక పాత్ర పోషించారు. 1975 ప్రపంచ కప్‌లో భాగంగా తూర్పు ఆఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో తన అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు (12-8-6-1)తో ఆ జట్టును 120 పరుగులకే కట్టడి చేశారు. క్రికెట్‌లో ఆయన సేవల్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1970లోనే పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. 1990లో న్యూజిలాండ్, ఇంగ్లండ్ పర్యటనల సమయంలో భారత క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా ఉన్నారు. జాతీయ సెలెక్టర్‌గానే కాకుండా మణిందర్ సింగ్, మురళీ కార్తిక్ వంటి అనేకమంది ప్రతిభావంతులైన స్పిన్నర్లకు మెంటర్‌గా ఉన్నారు. 2004లో సీకే నాయుడు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

ప్రధాని మోదీ, ఖర్గే విచారం: బిషన్ సింగ్ బేడీ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. క్రికెట్ పట్ల ఆయనకు ఉన్న అభిరుచి అచంచలమైందని, తన స్పిన్ బౌలింగ్‌తో భారత్‌కు చాలా చిరస్మరణీయ విజయాలు అందించడంలో కీలకంగా వ్యవ హరించారని గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తు తరాల క్రికెటర్లకు ఆయన స్ఫూర్తిమంతంగా నిలుస్తారని పేర్కొన్నారు. బిషన్ సింగ్ బేడీ కుటుంబ సభ్యులు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ట్వీట్ చేశారు. క్రికెట్ ప్రేమికులు 'ది సర్దార్ ఆఫ్ స్పిన్' అంటూ ముద్దుగా పిలుచుకొనే బిషన్ సింగ్ ప్రసిద్ధమైన క్రికెటర్లలో ఒకరని, ఆయన మరణవార్త చాలా బాధించిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. క్రీడారంగానికి అందించిన సేవల్ని గుర్తు చేసుకుంటూ... ఆయన కుటుంబ సభ్యులకు ఖర్గే ప్రగాఢ సానుభూతి తెలిపారు. బిషన్ సింగ్ బేడీ మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేయడంతో పాటు ఆయన సేవల్ని గుర్తు చేసుకుంటూ రాజకీయ, క్రీడా, సినీ ప్రముఖులు ట్వీట్లు చేశారు. బిషన్ సింగ్ కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, పంజాబ్ మాజీ సీఎం అమరీందర్ సింగ్, కేంద్ర మాజీమంత్రి హర్‌సిమ్రత్ కౌర్, బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్, మాజీ క్రికెటర్లు గౌతంగంభీర్, ఇర్ఫాన్ పఠాన్‌తో పాటు ప్రముఖులు 'ఎక్స్' (ట్విటర్)లో పోస్టులు పెట్టారు.

త్వరలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

ఎస్అండ్‌పీ గ్లోబల్ అంచనా

న్యూఢిల్లీ: ప్రపంచంలో ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్. 2030 నాటికి జపాన్‌ను దాటేయనుందని ఎస్ అండ్‌పీ గ్లోబల్ అంచనా వేసింది. 7.3 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేసుకున్న భారత్ పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.2 - 6.3 శాతం మేర వృద్ధి చెందొచ్చన్న అంచనా ఉంది. ఈ నేపథ్యంలో ఎస్ అండ్ పీ గ్లోబల్ తాజా అంచనాలను వెలువరించింది. 2022లో భారత జీడీపీ 3.5 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా 2030 నాటికి అది 7.3 ట్రిలియన్లకు చేరుతుందని ఆ నివేదిక పేర్కొంది. దీంతో జపాన్ జీడీపీని దాటేసి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగాను, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవనుందని అంచనా వేసింది. ప్రస్తుతం అమెరికా 25.5 ట్రిలియన్ డాలర్లతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ప్రపంచ జీడీపీలో నాలుగో వంతు అగ్రరాజ్యం వాటానే. ఇక 18 ట్రిలియన్ డాలర్లతో చైనా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 4.2 ట్రిలియన్ డాలర్లతో జపాన్, 4 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జర్మనీ మూడు నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారత దీర్ఘకాలిక వృద్ధికి వివిధ అంశాలు దోహదం చేస్తున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ పేర్కొంది. దేశంలో మధ్యతరగతి ఆదాయాలు వేగంగా పెరుగుతున్నాయని, దీనివల్ల దేశంలో వినియోగ వస్తువుల వినిమయం పెరగనుందని తెలిపింది. తద్వారా వినిమయ మార్కెట్, పారిశ్రామిక రంగం వృద్ధి చెంది వివిధ రంగాల్లో అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులకు స్వర్గధామం కానుందని పేర్కొంది. భారత డిజిటల్ ట్రాన్సఫర్మేషన్ కూడా ఇ-కామర్స్ వృద్ధికి ఊతం ఇవ్వనుందని, దీంతో రాబోయే దశాబ్దంలో భారత చిల్లర వినిమయ మార్కెట్ ముఖచిత్రం మారబోతోందని పేర్కొంది. 2030 నాటికి 110 కోట్ల మంది జనాభాకు ఇంటర్నెట్ అందుబాటులోకి రానుందని తెలిపింది. రాబోయే దశాబ్ద కాలంలో ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని అంచనా వేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.